# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 10-4-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:188 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

కోల్పోవగ సంతోషము
స్వాల్పమ్ముగ పట్టు వీడి సమరావనిలో
వేల్పులు దయతో నరయగ
కాల్పుల విరమించె "నమెరికా"యు "ఇరాను"న్ !!

(మంకు పట్టు వీడి అమెరికా,ఇరాన్ దేశాలు స్వల్ప కాలం కాల్పుల విరమణకు అంగీకరించాయి.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

మహాత్ముల జయంతి
మస్తుగానే జరిపేస్తరు
సిద్ధాంతం ఆశయాలు
చిత్రంగానే చెరిపేస్తరు
సామాజిక అభ్యున్నతి
సార్వజనిక వారి దృష్టి
పాటించక ప్రభుత్వాలు
ప్రస్తుతిస్తే లేదు పుష్టి



-వేల్పుల నారాయణ
9440433475

# విద్య ద్వారానే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి

## –డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



ఖమ్మం జిల్లా, ఏప్రిల్ 9 : కేసీఆర్ హయాంలోని పదేళ్లు వనరులు దోపిడీకి గురికావటం వల్ల తెలంగాణలో అభివృద్ధి జరగలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. విద్య ద్వారానే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఈరోజు(గురువారం) ఎర్రుపాలెంలో అమ్మ పౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు.

అక్షరమే ఆయుధంగా ప్రతి విద్యార్థి ఎదగాలి..

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. అక్షరమే ఆయుధంగా ప్రతి విద్యార్థి ఎదగాలని ఆకాంక్షించారు. జూన్ 2వ తేదీ నుంచి విద్యార్థులకు అల్పాహార పథకం అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని వివరించారు. ప్రతి బిడ్డకు ఉచితంగా మెరుగైన విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో 100 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుడతామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

రైతాంగాన్ని ఆదుకునేందుకు కృషి..

మధిర నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో చివరి భూములకు సాగునీరు అందించాలన్నదే తన సంకల్పమని తెలిపారు. రూ.36 కోట్లతో కట్టలేరు కాలువల మరమ్మతులను చేపట్టామని అన్నారు. ఎన్నెస్పీ కెనాల్ మూడవ జోన్ పరిధిలో ఉన్న భూములను రెండవ జోన్ కిందకు తీసుకు వచ్చి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందజేస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికొదిలేశారని ఆరోపించారు.

**సీతారామకు నిధులు కేటాయించాం..**

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీతారామకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయిస్తున్నామని స్పష్టం చేశారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ తీసుకువస్తున్నామని.. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం జరుగుతోందన్నారు. మధిర నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. కట్టలేరు ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.

# తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ప్రేమగా చూసుకోవాలి: మంత్రి సీతక్క

మహబూబాబాద్, ఏప్రిల్ 9:తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ప్రేమగా చూసుకోవడం పిల్లల బాధ్యత అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. సమాజంలో వృద్ధుల పట్ల గౌరవం, ఆదరణ పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈరోజు (గురువారం) మహబూబాబాద్‌లో మంత్రి సీతక్క పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మీడియాతో మాట్లాడారు.అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు అందించే పౌష్టికాహార పంపిణీని కచ్చితంగా పర్యవేక్షించేందుకు స్మార్ట్ ఫోన్లు రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా లబ్ధిదారుల వివరాలు, ఆహార పంపిణీ వివరాలు నమోదు చేసి పారదర్శకత పెంచుతామని చెప్పుకొచ్చారు. ఆరేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడం తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# ప్రమాదం జరిగితే 10 నిమిషాల్లోనే బాధితులను కాపాడుతాం: మంత్రి రాజనర్సింహ

హైదరాబాద్, ఏప్రిల్ 9:రోడ్డుప్రమాద బాధితులను రక్షించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో బాధితులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇందుకు సమగ్ర ట్రామా కేర్ పాలసీని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని మంత్రి చెప్పుకొచ్చారు. ఈ మేరకు హైదారాబాద్ కొండాపూర్‌లో 100 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో కలిసి మంత్రి రాజనర్సింహ శంకుస్థాపన చేశారు.



ఈ సందర్భంగా మంత్రి రాజనర్సింహ మాట్లాడు తూ..' రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను తక్షణమే ఆస్పత్రులకు తరలించి ప్రాణాలు కాపాడేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా జాతీయ, రాష్ట్ర రహదారుల వెంబడి అవసరమైన అన్ని వసతులతో 109 ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. రోడ్డు ప్రమాదం, ఇతర అత్యవసర పరిస్థితుల్లో 10 నిమిషాల్లోనే ఘటనా స్థలానికి చేరుకునేలా ఎమర్జెన్సీ రెస్పాన్స్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం. అందులో భాగంగా 108 అంబులెన్స్‌ల సంఖ్యా పెంచుతున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 31 క్రిటికల్ కేర్ బ్లాకులు ఏర్పాటు చేస్తున్నాం. నిజామాబాద్, నల్గొండ, కరీంనగర్, మహబూబాబాద్, జగిత్యాల, సంగారెడ్డి, నారాయణపేట్, ఆదిలాబాద్‌లో క్రిటికల్ కేర్ బ్లాకులను ఇప్పటికే ప్రారంభించుకున్నాం.మరో 21 సీసీబీల నిర్మాణం కొనసాగుతోంది. ఈ ఏడాది చివరికల్లా అన్నీ అందుబాటులోకి తీసుకొస్తాం. కొండాపూర్‌లో రూ.41 కోట్లతో 100 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి నేడు శంకుస్థాపన చేసుకున్నాం. వీలైనంత వేగంగా నిర్మాణం పూర్తి చేసి అత్యాధునిక వసతులతో వైద్య సేవలు అందించే విధంగా చర్యలు చేపడతాం. ఇక్కడ నివసించే ప్రజల కోసం ఈ క్రిటికల్ కేర్ సేవలు ఎంతగానో ఉపయోగపడుతాయి' అని తెలిపారు.

# భాగ్యనగరంలో కీలక మార్పులు



హైదరాబాద్, ఏప్రిల్ 9:భాగ్యనగరంలోని కీలకమైన షేక్‌పేట్ ఫ్లైఓవర్ నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు ట్రాఫిక్ కష్టాలను తీర్చి, ఈ మార్గాన్ని 'మోడల్ కారిడార్'గా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, ఐపీఎస్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఐఏఎస్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. అధికారులందరూ కలిసి ఒకే బస్సులో ప్రయాణిస్తూ.. మార్గమధ్యలో ఉన్న బాటిల్ నెక్‌లు (ట్రాఫిక్ అడ్డంకులు), నీరు నిలిచే ప్రాంతాలు, ఆక్రమణలను స్వయంగా పరిశీలించి తక్షణ పరిష్కార మార్గాలను సూచించారు.

ఎస్‌డిఐ హాస్పిటల్ వద్ద, బృందావన్ కాలనీ రోడ్ నంబర్-1 వద్ద కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిల (ఈుాః)ను నిర్మించాలని నిర్ణయించారు. షేక్‌పేట్ నాలా వద్ద పెలికాన్ సిగ్నల్, జీబ్రా క్రాసింగ్‌లను ఏర్పాటు చేయనున్నారు.

నానల్ నగర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు వీలుగా అక్కడ ఉన్న రోటరీ (ఖీనీబిజీతీఎ) వెడల్పును తగ్గించి, రహదారిని విస్తరించాలని అధికారులను ఆదేశించారు.

రేతిబౌలి నుంచి నానల్ నగర్ వరకు ఉన్న సెంట్రల్ మీడియన్‌ను, అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి రోడ్డును వెడల్పు చేయనున్నారు. ఎన్ఎండీసీ, డెల్ స్టోర్ ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్ ప్రకారం భూసేకరణ చేపట్టి రహదారి విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు.

రహదారి మధ్యలో ఉన్న రామాలయం ఆర్చ్, బొడ్రాయి, అలాగే షేక్‌పేట్ నాలా సమీపంలోని సమాధులను తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కమిషనర్లు ఆదేశించారు. మాసాబ్ ట్యాంక్ ఫ్లైఓవర్ వద్ద ఎత్తు పరిమితి బారియర్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. మెహదీపట్నం వైపు ఉన్న ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించి, పోచమ్మ బస్తీ నుంచి రోడ్ నంబర్ 12కు నేరుగా వెళ్లేలా స్లిప్ రోడ్డును అభివృద్ధి చేయనున్నారు.

ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం: సజ్జనార్

ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా తక్షణమే చేయదగ్గ పనులు, దీర్ఘకాలిక పనులను గుర్తించామని హైదరాబాద్ సీపీ సజ్జనార్, ఐపీఎస్ పేర్కొన్నారు.

ఆ పనులను రెండేళ్లలో పూర్తి చేస్తాం: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్

నగరంలోని ట్రాఫిక్ పనుల నిమిత్తం ప్రతి జోన్‌కు రూ. 20 కోట్ల చొప్పున మొత్తం రూ. 120 కోట్లు కేటాయిస్తున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ వెల్లడించారు. కేబీఆర్ పార్క్ వద్ద పెండింగ్‌లో ఉన్న పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి.జోయల్ డెవిస్ ఐపీఎస్ (జాయింట్ సీపీ ట్రాఫిక్), జి ముకుంద రెడ్డి ఐఏఎస్ (జోనల్ కమిషనర్), ప్రియాంక ఆలా ఐఏఎస్ (జోనల్ కమిషనర్), కాజల్ ఐపీఎస్ (డీసీపీ ట్రాఫిక్), కె. శ్రీనివాస్ (చీఫ్ సిటీ ప్లానర్), ఎస్.రత్నాకర్ (చీఫ్ ఇంజనీర్), వేణుగోపాల్ రెడ్డి (అడిషనల్ డీసీపీ), డి. ధనలక్ష్మి (ఏసీపీ ట్రాఫిక్ గోల్కొండ) ఇతర అధికారులు పాల్గొన్నారు.

# హర్మూజ్‌పై ఇరాన్ ఆంక్షలు.. రోజుకు 15 నౌకలకు మాత్రమే అనుమతి..!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: పశ్చిమాసియా యుద్ధంలో రెండు వారాలు తాత్కాలిక కాల్పుల విరమణతో హర్మూజ్ జలసంధి గుండా రాకపోకలకు ఇక ఏ ఆటంకం ఉండదని భావించిన ప్రపంచ దేశాలకు షాక్ ఇచ్చింది ఇరాన్. అంత తేలికగా హర్మూజ్‌పై తమ పెత్తనాన్ని వదులుకునేందుకు ఇష్టపడని ఇరాన్ కొన్ని షరతులు విధిస్తోంది. రోజుకు 15 నౌకలను మాత్రమే అనుమతించాలని భావిస్తోంది. అంతర్జాతీయ రవాణాలో కీలకమైన ఈ జలసంధిని దాటాలంటే కొన్ని నియమాలు వర్తిస్తాయని ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ వెలికి పెట్టడం చర్చనీయాంశమవుతోంది.

అమెరికా, ఇరాన్‌లు రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించడంతో సంబురపడిన ప్రపంచ దేశాలకు అంతలోనే షాకింగ్ న్యూస్. ఇంతముందులా హర్మూజ్ జలసంధి గుండా నౌకల రవాణా కొనసాగడానికి ఇరాన్ అభ్యంతరం చెబుతోంది. టోల్ వసూలు చేయాలని భావించిన ఇరాన్.. తమ ఆధిపత్యాన్ని చెలాయించేందుకు షరతులు విధిస్తోంది. రోజుకు 15 నౌకలకు మాత్రమే అనుమతిస్తామని పాకిస్థాన్‌తో చర్చలకు ముందే ఇరాన్ సీనియర్ వర్గాలు రష్యా వార్త సంస్థ టీఏఎస్ఎస్‌కు స్పష్టం చేశాయి. ప్రతి నౌక హర్మూజ్‌ను దాటాలంటే అందుకు ఇరాన్ అనుమతితో పాటు కొన్ని ప్రత్యేక నిబంధనలు పాటించడం తప్పనిసరని వెల్లడించాయి.

ప్రస్తుతం కాల్పుల విరమణ కొనసాగుతున్నందున రోజుకు 15 నౌకలను మాత్రమే హర్మూజ్ సంధి గుండా వెళ్లనిస్తాం. ఇరాన్ అనుమతి, కొన్ని ప్రత్యేక నిబంధనల మేరకే ఈ నౌకలు హర్మూజ్‌ను దాటుతాయి. కొత్తగా తీసుకొచ్చిన ఈ నియంత్రణ నియమాలను ఐఆర్‌జీసీ కనుసన్నల్లో జరుగుతాయి.

# లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడి.. 250 మందికిపైగా మృతి



న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 9: అమెరికా-ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు ప్రకటన వెలువడిన వెంటనే లెబనాన్ పై ఇజ్రాయెల్ క్షిపణులతో విరుచుకుపడింది. లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసింది. ఈ దాడుల్లో భారీగా ప్రాణనష్టం జరిగింది. మొత్తం 254 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో వెయ్యి మందికిపైగా గాయపడ్డారు. అయితే కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత కూడా ఇజ్రాయెల్ లెబనాన్‌పై దాడికి పాల్పడటంతో ఇరాన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ క్రమంలోనే హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్టు ప్రకటించింది.

కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన వెంటనే లెబనాన్‌పై ఈ దాడులు జరిగాయి. కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా తమ మిత్రపక్షాలపై కూడా దాడులు చేయకూడదని ఇరాన్ డిమాండ్ చేయగా.. ఇజ్రాయెల్ అంగీకరించలేదు. హెజ్బొల్లా చేసే దాడులను అడ్డుకొనే లక్ష్యంతో లిటాని నది వరకు బఫర్‌జోన్‌ను ఏర్పాటు చేసుకోవడానికి మార్చి 2న ఇజ్రాయెల్ సైన్యం లెబనాన్‌లో గ్రౌండ్ ఆపరేషన్ ప్రారంభించింది. ఇప్పుడు ఆ ఆపరేషన్‌ను ఆపేందుకు ఇజ్రాయెల్ సుముఖంగా లేదు. కాల్పుల విరమణ ప్రకటన అనంతరం 10 నిమిషాల వ్యవధిలో లెబనాన్‌లోని పలు ప్రదేశాలపై ఇజ్రాయెల్ 100 ఎయిర్ స్ట్రయిక్స్ చేపట్టింది.

# జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లోకి వెళ్లాలనుకోవడం తప్పుడు నిర్ణయం: ఎంపీ అరవింద్

జగిత్యాల జిల్లా, ఏప్రిల్ 9 మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లోకి వెళ్లాలనుకోవడం తప్పుడు నిర్ణయమని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ పేర్కొన్నారు. జీవన్ రెడ్డి పార్టీ మారాలనుకోవడం తొందరపాటుతో తీసుకున్న నిర్ణయమని తెలిపారు. జీవన్ రెడ్డి అంటే తనకు చాలా గౌరవమని చెప్పుకొచ్చారు. ఈరోజు(గురువారం) జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి నిశాంత్ కార్తికేయ బీజేపీలో చేరారు. పార్టీ కండువా కప్పి కమలం పార్టీలోకి ఎంపీ అరవింద్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ అరవింద్ మాట్లాడారు.

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీకి మంట పెడతారని విమర్శించారు. ఓట్ల కోసం ఒక పార్టీ అభివృద్ధి పేరుతో మరో పార్టీ అని చెప్పుకుని తిరిగే వ్యక్తి సంజయ్ అని ఎద్దేవా చేశారు.

# మూడు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్: ఈసీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 09: అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. గురువారం సాయంత్రం 5 గంటలకు ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ ముగిసింది. ఇప్పటి వరకు పుదుచ్చేరిలో 86.92 శాతం, అసోంలో 84.42 శాతం, కేరళంలో 75.01 శాతం పోలింగ్ నమోదు అయిందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.

గురువారం ఉదయం అసోం (126), కేరళం (140), పుదుచ్చేరి (30) లలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. ఈ ఎన్నికల పోలింగ్ వేళ.. ఏర్పాట్లను ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఆయా రాష్ట్రాలోని పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా భద్రతా సిబ్బందిని మోహరించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది.

ఈ ఏడాది మార్చి రెండో వారంలో దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని అసెంబ్లీలకు కేంద్రం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకటించింది. అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీలకు ఏప్రిల్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపింది. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23వ తేదీన ఒక దశలో ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని వెల్లడించింది. పశ్చిమ బెంగాల్‌లోని 294 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని పేర్కొంది. మే 4వ తేదీన ఈ ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడతామని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

# ఏపీలో విషాదం.. సెల్ఫీ దిగుతూ జలపాతంలో ముగ్గురు యువతులు మృతి

అమరావతి, ఏప్రిల్ 9:ఏపీలో విషాదం చోటు చేసుకుంది. సెల్ఫీ పిచ్చిలో ప్రమాదవశాత్తు జలపాతంలో పడి ముగ్గురు మృతి చెందారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం మూలగుమ్మిలో ఈ ఘటన చోటు చేసుకుంది. మూలగుమ్మి జలపాతం వద్ద గురువారం మధ్యాహ్నం నలుగురు యువతులు సెల్ఫీ దిగుతూ ప్రమాదవశాత్తు జలపాతంలో పడి కొట్టుకుపోయారు. వీరిలో త్రిష ( 17 ), రత్నకుమారి ( 16), పవిత్ర (16 ) అనే ముగ్గురు మృతి చెందగా అంజలి అనే మరో యువతిని స్థానికులు కాపాడారు. అయితే ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెను లుంగపర్తి ఆసుపత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాలను చూసి బోరున విలపించారు.

# రాజకీయ ఫ్లెక్సీలపై హైకోర్టు సీరియస్..

అమరావతి, ఏప్రిల్ 9: ఎల్‌ఓసీ రద్దు చేయాలని వైసీపీ నేత సజ్జల భార్గవ్ రెడ్డి వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

రాజ కీయ ఫ్లెక్సీలపై రాస్తున్న రాతలపై తీవ్రంగా స్పందించింది. 2029లో చేయబోయే విధ్వంసం కోసం ఎదు రుచూస్తున్నామని రాస్తారా.. అని పిటిషనర్‌ని నిలదీసింది. ఎవరిని ధ్వంసం చేస్తారు.. రాష్ట్రాన్నా... ప్రజలనా... అంటూ మండిపడింది. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై ఆగ్రహించింది.

పోలీసుల చేతకాని తనంతోనే అసభ్యకర పోస్టులు పెడుతూ అనుచిత రాతలు రాస్తున్నారని సీరియస్ అయ్యింది హైకోర్టు. ఒకసారి అరెస్టయిన వారు కూడా తిరిగి అదే రీతిలో అసభ్యకర పోస్టులు పెడుతు న్నారని కోపగించుకుంది.

జడ్జిల పై పోస్టులు పెట్టినప్పుడే పోలీసులు కఠినంగా వ్యవహరించి ఉంటే ఈ పరిస్థితి రాకుండా ఉండేదని ధర్మాసనం తెలిపింది.

అనుచిత, అభ్యంత రకర పోస్టులను డీల్ చేయడంలో ఖాకీలు విఫ లమయ్యారని ఘాటుగా స్పందించింది.

# హోమియోపతి పునాదిగా అందరికీ వైద్యం

## (10 ఏప్రిల్ "ప్రపంచ హోమియోపతి దినోత్సవం" సందర్భంగా)

ప్రజారోగ్య పరిరక్షణలో హోమియోపతి వైద్య విధానాలను వ్యాప్తి చేయడానికి, హోమియో వైద్య అభివృద్ధికి, సవాళ్లను అధిగమించడానికి, సాధారణం ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 10 ఏప్రిల్‌న "ప్రపంచ హోమియోపతి దినోత్సవం" నిర్వహించకపోవడం ఆనవాయితీగా మారింది. హోమియో వైద్య వ్యవస్థాపకుడు, పితామహుడు అయిన డా క్రిస్టియన్ శామ్యూల్ హానిమాన్ జన్మదినం 10 ఏప్రిల్ 1755 సందర్భంగా ప్రపంచ హోమియోపతి దినోత్సవం నిర్వహించడం కొనసాగుతున్నది. ప్రకృతి ప్రసాదించే మొక్కలు, ఖనిజాలు, జంతువుల నుంచి సేకరించిన ఔషధాలతో వ్యాధులకు హోమియో చికిత్సలు చేస్తారు. హోమియోపతి వైద్య విధానానికి ప్రధాన సూత్రంగా "లైక్ లౌస్ లైక్" అనే భావాన్ని తీసుకుంటారు. హోమియోపతి అనగా హోమియో (ఒకే రకమైన), పతోస్ (వ్యాధి) అనే గ్రీక్ భాష అర్థాలు ఉన్నాయి.

### భారతంలో హోమియోపతికి ప్రజాదరణ:

హోమియోపతి వైద్య విధానం భారతంలో 1973లో ప్రభుత్వ గుర్తింపుతో బహుళ ప్రచారం పొందడం, 2014 తర్వాత అల్లోపతి వైద్యంతో పాటు "ఆయుష్ (ఆయుర్వేద, యోగా, యునానీ, సిద్ధ యోగా, నాచురోపతి, హోమియోపతి)" అంత్రికడత్వ శాఖను ప్రారంభించి హోమియో వైద్య విధానానికి పట్టం కట్టడం జరిగింది. శరీర వ్యాధినిరోధక శక్తిని పెంపొందిస్తూ వ్యాధి మూలాలను కనుగొని ఔషధ చికిత్సను చేయడం, ఎలాంటి ఔషధ దుష్ప్రభావాలు లేకుండా ఉండడం హోమియో ప్రత్యేకతగా తీసుకోవాలి. మన దేశంలో అనేక అనేక హోమియో వైద్య కళాశాలలు, హోమియో ఆసుపత్రులు ప్రారంభించడం జరుగుతున్నది. హోమియోపతి వైద్యం ద్వారా చర్మ, జీర్ణకోశ, ఎలర్జీ, మైగ్రెయిన్, మానసిక ఒత్తిడి, కీళ్ల నొప్పులు, నీరసం, రుతుస్రావం ముందు అనారోగ్యం, దీర్ఘకాలిక అలసట, అస్తమా, వినికిడి రోగాలు, బీపీ, జలుబు లాంటి వ్యాధులకు సమర్థవంతంగా చికిత్సలు చేస్తారు. దేశవ్యాప్తంగా 100 మిలియన్ల ప్రజలు హోమియో చికిత్సలు పొందుతుండగా, 2 లక్షల హోమియో డాక్టర్లు సేవలు అందిస్తూ, ప్రతి ఏట 12,000 మంది వైద్యులు హోమియో రంగంలోకి అడుగిడుతున్నారు.

ప్రపంచ హోమియో దినం రోజుల హోమియో వైద్య శిబిరాలు, సెమినార్లు, సింపోజియాలు, కార్యశాలలు, హోమియో వైద్యులను సన్మానంచడం లాంటి కార్యక్రమాలు చేయడం జరుగుతుంది. ప్రపంచ హోమియోపతి దినోత్సవం-2026 ఇతివృత్తంగా "హోమియోపతితో సామరస్యం - హద్దులు దాటి వైద్యం చేయడం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. సహజమైన, సరళమైన, సురక్షితమైన, ప్రభావితమైన హోమియోపతితో ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా రోగం మూలలను కనుగొని స్వస్థత చేకూర్చుతున్న ప్రపంచ హోమియోపతి వైద్యులకు, హోమియో వైద్యం పొందుతున్న రోగులకు ప్రపంచ హోమియోపతి దినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేద్దాం.



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# జైపూర్ మెట్రో ప్రాజెక్టు రెండో దశకు మంత్రివర్గ ఆమోదం

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 9:ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన మంత్రి వర్గం.. జైపూర్ మెట్రో రెండో దశను ఆమోదించింది. ప్రహ్లాదపుర నుంచి టోడి మోడ్ వరకు 41 కి.మీ.ల పొడవుతో 36 స్టేషన్లతో కూడిన ఉత్తర-దక్షిణ కారిడార్ నిర్మాణాన్ని రూ.13,037.66 కోట్ల అంచనా వ్యయంతో చేపడతారు. కేంద్ర ప్రభుత్వం, రాజస్థాన్ ప్రభుత్వాలు 50:50 భాగస్వామ్యంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టును రాజస్థాన్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఆర్ఎంఆర్సీఎల్) నిర్మిస్తుంది.

సీతాపుర ఇండస్ట్రియల్ ఏరియా, వీకేఐఏ, జైపూర్ విమానాశ్రయం, టోంక్ రోడ్డు, ఎస్ఎంఎస్ ఆసుపత్రి, స్టేడియం, అంబారీ, విద్యాధర్ నగర్ లాంటి ప్రధానకేంద్రాలకు అవాంతరాలు లేని రవాణాను రెండో దశ మెట్రో అందిస్తుంది. విమానాశ్రయ ప్రాంతంలో భూగర్భ స్టేషన్లు నిర్మిస్తారు. అలాగే ప్రణాళికాబద్ధమైన ఇంటర్‌ఛేంజ్‌లు, ఫీడర్ వ్యవస్థల ద్వారా ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న మొదటి దశకు అనుసంధానించడం ద్వారా నగరం మొత్తం మీద ఏకీకృతమైన, నిరంతరాయమైన మెట్రో వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది.

తక్కువ దూరమే ఉన్నప్పటికీ అత్యంత కీలకమైన 11.64 కి.మీ.ల జైపూర్ మొదటి దశ మెట్రోలో రోజుకు సగటున ప్రయాణిస్తున్నవారి సంఖ్య సుమారుగా 60,000. మెట్రో రెండో దశ ప్రారంభమైతే ప్రయాణికుల సంఖ్య అనేక రెట్లు పెరుగుతుందనీ, జైపూర్ ప్రజా రవాణా వ్యవస్థ వాటా పెరిగి ప్రైవేటు వాహనాలపై ఆధారపడటం తగ్గుతుందనీ అంచనా వేస్తున్నారు.

అంతర మంత్రిత్వ శాఖల సంప్రదింపులు, నెట్వర్క్ ప్లానింగ్ గ్రూపు సమీక్ష, పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు మూల్యాంకనం సహా బహుళ దశల్లో జైపూర్ మెట్రో రెండో దశను సమగ్రమదింపు చేశారు. నిర్దేశిత పరిమితి (ంగ14%) కంటే ఈ ప్రాజెక్టు ఎకనామిక్ ఇంటర్నల్ రేట్ ఆఫ్ రిటర్న్ (ఈఐఆర్ఆర్) ఎక్కువగా ఉంది. ఇది బలమైన సామాజిక-ఆర్థిక సామర్థ్యాన్ని సూచిస్తుంది. మెట్రో రైలు విధానం-2017కు అనుగుణంగా భారత ప్రభుత్వం, రాజస్థాన్ ప్రభుత్వం నుంచి ఈక్విటీ సహాయంతో పాటు అనుబంధ రుణం, బహుళ విధ ఫైనాన్సింగ్ ద్వారా నిధుల సమీకరణ జరుగుతుంది.

రాజస్థాన్ టీవోడీ విధానం - 2025, ప్రతిపాదిత యూఎంటీఏ సంస్కరణలు, జాతీయ సుస్థిర పట్టణ రవాణా లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు ఉంది. 2031 సెప్టెంబరు నాటికి జైపూర్ మెట్రో రెండో దశను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇది పూర్తయితే ట్రాఫిక్ రద్దీ, వాహన ఉద్గారాలు తగ్గుతాయనీ, ప్రజలు, కార్మికులు, పర్యాటకులకు ప్రయాణ సౌలభ్యం మెరుగుపడుతుందనీ అంచనా వేస్తున్నారు. అలాగే ఆధునికమైన, భవిష్యత్తు అవసరాలకు తగినట్టుగా జైపూర్‌ను సిద్ధం చేస్తుందనీ, వికసిత భారత్, వికసిత రాజస్థాన్ దిశగా ముందుకు నడిపిస్తుందనీ భావిస్తున్నారు.

మొదటి దశ పరిధిలో ఇప్పటికే జైపూర్ మెట్రో వ్యవస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. మానసరోవర్ నుంచి బడీ చౌపర్ వరకు 11.64 కి.మీ.ల మేర ఈ తూర్పు-పశ్చిమ కారిడార్ విస్తరించింది. మొత్తం 11 స్టేషన్లతో ముఖ్యమైన నివాస, వాణిజ్య ప్రాంతాలను జైపూర్ సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ అయిన హెరిటేజ్ వాల్డ్ సిటీతో కలుపుతుంది. జైపూర్ మెట్రో రెండో దశలో ప్రతిపాదించిన ఉత్తర-దక్షిణ కారిడార్, ప్రస్తుత కొనసాగుతున్న కారిడార్‌కు అనుబంధంగా ఉండి, నగరం అంతటా? మెట్రో సదుపాయాన్ని అందిస్తుంది. ఫలితంగా ట్రాఫిక్ రద్దీ తగ్గి.. నగర రవాణా వ్యవస్థ మెరుగుపడుతుంది.

# పీఎం ముద్రా యోజన 11వ వార్షికోత్సవం

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 9:పీఎం ముద్రా యోజన విజయవంతం కావడంపై ప్రజలతో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తన ఆలోచనలను ఈ రోజు పంచుకున్నారు. ఈ పథకం లక్షల మందికి కలలను కనే ఆత్మవిశ్వాసాన్ని ఇవ్వడంతో పాటు ఆ స్వప్నాలను నెరవేర్చుకొనేందుకు మార్గాలనూ చూపి వారిని ఎలా శక్తిమంతుల్ని చేసిందీ ఆయన వివరించారు.

మన ప్రజల ఆకాంక్షలపై భరోసా పెట్టుకొని అడ్డంకుల్ని తొలగించి ఈ కార్యక్రమం భారత్ అంతటా ఔత్సాహిక పారిశ్రామికత్వ స్ఫూర్తిని పటిష్ఠపరిచిందని ప్రధానమంత్రి అన్నారు. అవసరాలను అందుబాటులోకి తెచ్చి, ప్రయత్నాల్ని ప్రోత్సహించే ఒక ఆర్థిక సహాయ స్రవంతిగా పీఎం ముద్రా యోజన ఉందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. వ్యవస్థలో మార్పును తీసుకువచ్చే దక్షత ఈ పథకానికి ఉందని ప్రధానమంత్రి చెబుతూ, ఇది ప్రతి కలా సాకారం అయ్యేందుకు కావలసిన సహాయాన్ని అందిస్తూ యువ శక్తినీ, మహిళా శక్తినీ ఎలా సకారాత్మకంగా ప్రభావితం చేస్తున్నదీ వివరించారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో అనేక సందేశాలను ప్రధాన మంత్రి పొందుపరుస్తూ లక్షల మందికి కలలు కనే ఆత్మవిశ్వాసంతో పాటు వాటిని పండించుకొనేందుకు తగ్గ వనరులను కూడా అందజేస్తూ రుణ లభ్యత ప్రక్రియకు సరికొత్త అర్థాన్ని పీఎం ముద్రా యోజన ఇచ్చింది.

ఈ పథకం మన వాళ్ల ఆకాంక్షలను నమ్ముతూ, అవరోధాలను తొలగిస్తూ, భారత్ నలుమూలలా ఔత్సాహిక పారిశ్రామికత్వ భావనను బలోపేతం చేసింది.

ముద్రా యోజనకు ఉన్న పరివర్తనపూర్వక సామర్థ్యం సంగతేంటో చూడండి..ఇది మన యువ శక్తిపైనా, మన మహిళా శక్తి పైనా ఎంతటి సానుకూల ప్రభావాన్ని చూపిందో కదూ.

అవకాశాలు అతి చేరువలోనే ఉండే... ప్రయత్నాలకు ప్రోత్సాహం దక్కే, ప్రతి కలనూ నిజం చేసుకొనేందుకు కావలసిన సాయాన్ని సమకూర్చే ఆర్థిక సహాయ స్రవంతికి పీఎం ముద్రా యోజన ప్రతీక అని పేర్కొన్నారు.

# నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత..

### భూగర్భ జలాల పెంపు, చెరువుల పునరుద్ధరణకు 100 రోజుల కార్యాచరణ - కలెక్టర్ డా. ఏ. సిరి



అమరావతి, ఏప్రిల్ 9: నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భూగర్భ జలాల పెంపుదలతో పాటు చెరువుల పునరుద్ధరణ కోసం జిల్లాలో 100 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు. జలధార?నీటి భద్రత కార్యక్రమంలో భాగంగా గురువారం కోసిగి మండలం డి. బెలగల్ గ్రామంలోని చెక్ డ్యామ్, నాగమ్మ చెరువును జాయింట్ కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చెక్ డ్యామ్‌లు, చెరువులను నీటితో నింపేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాగులు, వంకలలో ఉన్న అడ్డంకులను తొలగించి చెరువులకు నీరు చేరేలా చూడాలని సూచించారు. భూగర్భ జల మట్టాన్ని పెంచేందుకు సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి జిల్లాలోని అన్ని మండలాల్లో అమలు చేయాలని ఇరిగేషన్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కెనాల్స్‌లోని నీటిని ఎల్ఎల్‌సీ, చెరువులతో అనుసంధానం చేసి నీటి నిల్వ సామర్థ్యాన్ని గరిష్టంగా పెంచేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

ఫీడర్ కెనాల్స్ పరిస్థితి, వాటి సామర్థ్యం, జంగిల్ క్లియరెన్స్, బండ్ల మరమ్మతులపై సమగ్ర చర్చ జరిపిన కలెక్టర్, అవసరమైన ఎస్టిమేట్లను సిద్ధం చేసి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కోసిగి మండలంలో చెరువులు, కుంటలు పూడికతో నిండిపోయి లేదా ఎండిపోయి ఉండటం వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గిందన్నారు. జిల్లాలో భూగర్భ జలాల సగటు 6.6 మీటర్లు ఉండగా, కోసిగిలో అది 29 మీటర్ల లోతులో ఉండటం ఆందోళనకరమని తెలిపారు. సమీపంలోని పెద్దకడబూరులో మాత్రం కేవలం 2 మీటర్లలోనే నీటి మట్టం ఉండటం గమనార్హమన్నారు. జిల్లా సగటును 4 మీటర్లలోపుకు తీసుకురావడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

డ్వామా, ఇరిగేషన్, వ్యవసాయ, పంచాయతీ రాజ్ శాఖల సమన్వయంతో యాక్షన్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. వీబీజీ రామ్‌జీ పథకం కింద పనులను శాస్త్రీయంగా అమలు చేసి భూగర్భ జలాల పెంపుదల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాలో 246 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు ఉండగా, ఇటీవల వర్షాల కారణంగా వాటిలో 75 శాతం కంటే ఎక్కువ నిండాయని చెప్పారు. అయితే వర్షాలపైనే ఆధారపడకుండా వాగులు, వంకలు శుభ్రపరిచి చిన్న కుంటలను కూడా నింపగలిగితే సాగునీటి కోసం ఆధారపడిన బోరు బావులు తిరిగి పనిచేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

అందుకే ముందుగా గ్రౌండ్ వాటర్ రీఛార్జ్‌పై దృష్టి సారించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, డ్వామా పీడీ నరసింహా రెడ్డి, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, కోసిగి తహసీల్దార్ వేణుగోపాల్ శర్మ, ఎల్ఎల్‌సీ చైర్మన్ టిప్పు సుల్తాన్, కూటమి నాయకులు ముత్తురెడ్డి రామిరెడ్డి, నర్సారెడ్డి తదితరులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# రాయలసీమ హక్కులపై 12 ఏళ్లుగా సాగుతున్న మోసం..

### -రాయలసీమ ప్రాంతాన్ని రాయలసీమ నాయకులు మోసం చేశారు..
### -సాగునీటి సమితి రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి..

అమరావతి, ఏప్రిల్ 9: ఏపీ లో రాష్ట్ర విభజన చట్టంలో రాయలసీమకు హామీ ఇచ్చిన హక్కులను గత 12 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న మూడు ప్రభుత్వాలు అమలు చేయకపోవడం కేవలం నిర్లక్ష్యం కాదు.. ఇది స్పష్టమైన ద్రోహం అని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం సమితి కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొజ్జా మాట్లాడుతూ విభజన చట్టంలో పేర్కొన్న ప్రత్యేక ప్యాకేజీతో పాటు తెలుగుగంగ, గాలేరునగరి, హంద్రీనీవా, వెలు గొండ వంటి సాగునీటి ప్రాజెక్టు లు, కడప ఉక్కు కర్మాగారం, గుంతకల్లు రైల్వే జోన్, అనంతపు రంలో ఎయిమ్స్ వంటి హామీలు అన్నీ కేవలం ఎన్నికల నినాదా లుగానే మిగిలిపోయాయన్నారు.

ఒక్క అడుగు కూడా ముందుకు వేయని పాలకుల వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు. అలగనూరు రిజర్వాయర్ నుంచి



గోరుకల్లు రిజర్వాయర్ మరమ్మత్తులు, గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం వరకు అన్ని ప్రాజెక్టులు ప్రకటనలకే పరిమి తమైపోయాయన్నారు. పుష్కర కాలంగా రాయలసీమ ప్రజలను మభ్యపెట్టడమే ప్రభుత్వాల పని అయిందన్నారు. రాయలసీమను పూర్తిగా వనరుల దోపిడి కేంద్రంగా మార్చి, నీరు, అటవీ సంపద, ఖనిజాలను ఇతర ప్రాంతాలకు తరలించేసి ఈ ప్రాంతాన్ని నిర్వీర్యం చేశరన్నారు.ప్రస్తుతం సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టుల పేరుతో రైతుల భూములను స్వాధీనం చేసుకుని, వ్యవసాయం మీద ఆధారపడిన రైతులు, కూలీలు, కౌలు రైతులను ఉపాధి లేకుండా చేస్తూ, ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ఇతర ప్రాంతాలకు తరలించడం అత్యంత దారుణమన్నారు. కోస్తా ప్రాంతంలో పండిన వరి పంటను కనీస మద్దతు ధరకు భారీ స్థాయిలో కొనుగోలు చేపడుతున్న ప్రభుత్వాలు, అదే సమయంలో ప్రభుత్వ సూచనల మేరకు వరికి ప్రత్యామ్నాయంగా రాయలసీమలో పండిస్తున్న చిరుధాన్యాలు, పప్పు దినుసులను కనీస మద్దతు ధరకు సేకరించడంలో స్పష్టమైన వివక్ష చూపించటం తగదన్నారు.

రాయలసీమకు హక్కులు కాగితాలపైనే? అమలులో మాత్రం సున్నా అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.రాష్ట్ర విభజన చట్టం ప్రకారం పదేళ్లు హైదరాబాద్‌ను రాజధానిగా కొనసాగించాల్సి ఉన్నప్పటికీ, ఆగమేఘాల మీద రాజధాని మార్పిడి చేసి రాష్ట్రాన్ని అప్పుల కూపంలోకి నెట్టారని, దీనికి అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ సమానంగా బాధ్యత వహించలన్నారు. రాయలసీమకు న్యాయం చేయకుండా రాజధాని అభివృద్ధి పేరుతో నాటకాలు ఆపాలన్నారు.

రాజకీయ పార్టీలు ఈ ద్రోహంపై మౌనం పాటించడం, రాయలసీమ సమాజం నిశ్శబ్దంగా ఉండడవే దీనికి కారణమని పేర్కొంటూ, ఇకపై ప్రజలను చైతన్యపరిచే పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

రాబోయే రోజుల్లో భారీ స్థాయిలో ఆందోళనలు, కార్యక్రమాలు చేపట్టి రాయలసీమ హక్కుల కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో చెరుకూరి వెంకటేశ్వర నాయుడు, బెక్కెం రామసుబ్బారెడ్డి, బాలీశ్వరరెడ్డి, సంజీవ, రామనాగిరెడ్డి, రెడ్డి జాఫర్, చంద్రశేఖర్, యుగంధర్, ఎంసీ కొండారెడ్డి, మనోజ్, దశరధరామ్, శివరాంరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ఎర్రం శంకర రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అరుణాచల్‌ప్రదేశ్‌లోని అంజా జిల్లాలో రూ.14,105.83 కోట్ల వ్యయంతో 1200 ఎండబ్ల్యూ సామర్థ్యం గల కలై-II జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి కేబినెట్ ఆమోదం

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 9:అరుణాచల్‌ప్రదేశ్‌లోని అంజా జిల్లాలో లోహిత్ నదిపై రూ.14, 105.83 కోట్ల వ్యయంతో 1200 ఎండబ్ల్యూ సామర్థ్యం గల కలై-ఎఎ జల విద్యుత్ ప్రాజెక్టు (హెచ్ఈపీ) నిర్మాణానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. 78 నెలల్లో ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని అంచనా. 1200 ఎండబ్ల్యూ (6లీ190 ఎండబ్ల్యూ, 1లీ60 ఎండబ్ల్యూ) సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు ఏడాదికి 4852.95 ఎంయూల విద్యుత్తును ఉత్పత్తి చేస్తుందని అంచనా. లోహిత్ బేసిన్‌లో నిర్మించనున్న తొలి జలవిద్యుత్ ప్రాజెక్టు ఇది. రాష్ట్ర విద్యుత్ సరఫరాను మెరుగుపరచడమే కాక, అధిక డిమాండు సమయాల్లో విద్యుత్ అవసరాలను తీర్చటంలో, జాతీయ గ్రిడ్ సమతుల్యతను కాపాడటంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుంది.

టీహెచ్‌డీసీ ఇండియా లిమిటెడ్, అరుణాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఏర్పాటు చేసే ఒక జాయింట్ వెంచర్ కంపెనీ ద్వారా ఈ ప్రాజెక్టును నిర్మిస్తారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రహదారులు, వంతెనలు, సంబంధిత విద్యుత్ సరఫరా నిర్మాణానికి భారత ప్రభుత్వం రూ. 599.88 కోట్ల బడ్జెట్ సహాయాన్ని అందిస్తుంది. అదనంగా రాష్ట్ర ప్రభుత్వ వాటాలో మరో రూ.750 కోట్లను ఆర్థిక సహాయంగా కేంద్రం అందిస్తుంది.

రాష్ట్రానికి 12 శాతం ఉచిత విద్యుత్, స్థానిక ప్రాంత అభివృద్ధి నిధి (ఎల్ ఏడీఎఫ్)కి కేటాయించిన అదనపు ఒక శాతం విద్యుత్ లభిస్తుంది.

# హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్), రాజస్థాన్ ప్రభుత్వాల జాయింట్ వెంచర్- హెచ్ఆర్ఆర్ఎల్

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 9:హెచపీసీఎల్ రాజస్థాన్ రిఫైనరీ లిమిటెడ్ (హెచ్ఆర్ఆర్ఎల్) ప్రాజెక్టు వ్యయాన్ని రూ. 43,129 కోట్ల నుంచి రూ. 79,459 కోట్లకు పెంచేందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. దీనితో పాటు హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) నుంచి రూ. 8,962 కోట్ల అదనపు ఈక్విటీ పెట్టుబడికి కూడా ఆమోదం లభించింది. ఈ పెంపు తర్వాత ప్రాజెక్టులో హెచ్‌పీసీఎల్ మొత్తం ఈక్విటీ పెట్టుబడి రూ. 19,600 కోట్లకు చేరుకుంటుంది. హెచ్‌పీసీఎల్ రాజస్థాన్ రిఫైనరీ (హెచ్ఆర్ఆర్ఎల్) 26 శాతం ముడి చమురును పెట్రోకెమికల్ ఉత్పత్తులుగా తయారు చేసే అత్యంత సంక్లిష్టమైన చమురు శుద్ధి కేంద్రం. ఇది ఏటా 1 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎంటీపీఏ) పెట్రోల్, 4 ఎంఎం టీపీఏ డీజిల్‌తో పాటు 1 ఎంఎంటీపీఏ పాలీప్రొపిలీన్, 0.5 ఎంఎంటీపీఏ ఎల్ఎల్ పీడీఈ (లీనియర్ లో డెన్సిటీ పాలీఎథిలీన్), 0.5 ఎంఎంటీపీఏ హెచడీపీఈ (హై డెన్సిటీ పాలీఎథిలీన్).. సుమారు 0.4 ఎంఎంటీపీఏ బెంజీన్, టోలీన్, బ్యూటాడైన్లను ఉత్పత్తి చేస్తుంది. ఈ ఉత్పత్తులన్నీ రవాణా, ఫార్మా, పెయింట్స్, ప్యాకేజింగ్ పరిశ్రమల వంటి భారతదేశ ఇంధన, పారిశ్రామిక వ్యవస్థలకు అత్యంత కీలకం. ఈ ప్రాజెక్టు ఇంధన స్వయం సమృద్ధిని అందించడమే కాకుండా పెట్రోకెమికల్ రంగంలో ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది.

# ఫాస్ఫేటిక్, పొటాషిక్ (పీ అండ్ కే) ఎరువులపై 2026 ఖరీఫ్ సీజను కు పోషకాధారిత సబ్సిడీ (ఎన్‌బీఎస్) రేట్లకు మంత్రిమండలి ఆమోద ముద్ర

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9:ఫాస్ఫేటిక్, పొటాషిక్ (పీ అండ్ కే) ఎరువులపై 2026 ఖరీఫ్ సీజను (01.04.2026 నుంచి 30.09.2026)కు పోషకాధారిత సబ్సిడీ (ఎన్‌బీఎస్) రేట్లను ఖరారు చేస్తూ ఎరువుల విభాగం చేసిన ప్రతిపాదనను కేంద్ర మంత్రి మండలి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు సమావేశమై, ఆమోదించింది. 2026 ఖరీఫ్ సీజనుకు తాత్కాలికంగా దాదాపు రూ.41, 533.81 కోట్లు అవసరమవుతాయి. ఇది 2025 సంవత్సర ఖరీఫ్ సీజను అవసరాలతో పోలిస్తే రూ.4,317 కోట్లు ఎక్కువ. 2026 ఖరీఫ్ సీజను బడ్జెటు రూ.37,216.15 కోట్లుగా ఉంది.రైతులకు చౌకయిన, గిట్టుబాటైన, హేతుబద్ధమైన ధరలకు ఎరువులు అందుబాటులోకి వస్తాయి.ఎరువులు, ఇన్‌పుట్లకు సంబంధించిన అంతర్జాతీయ ధరల్లో ఇటీవలి ధోరణులను దృష్టిలో పెట్టుకొని ఫాస్ఫేట్, పొటాష్ ఎరువులపై సబ్సిడీని హేతుబద్ధీకరించారు.రైతులకు గిట్టుబాటు ధరల్లో ఈ ఎరువులను సజావుగా అం దించడానికి గాను డీఏపీ, ఎన్‌పీకేఎస్ గ్రేడ్లకు చెందిన ఎరువులు సహా ఫాస్ఫేట్, పొటాష్ ఎరువుల పై 2026 ఖరీఫ్‌కు ఆమోదించిన ధరల ఆధారంగా సబ్సిడీని సమకూరుస్తారు. (ఈ ధరలను 01.04.2026 మొదలు 30. 09.2026 వరకు అమలు చేస్తారు).

ఎరువుల తయారీదారు సంస్థలు, దిగుమతి సంస్థల నుంచి రైతులకు సబ్సిడీ ధరలకు డీఏపీ సహా ఫాస్ఫేట్, పొటాష్ (పీ అండ్ కే) ఎరువుల్లో 28 గ్రేడ్లను అందుబాటులో ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. పీ అండ్ కే ఎరువులపై సబ్సిడీని 2021 ఏప్రిల్ 1 నుంచి పోషకాధారిత సబ్సిడీ (ఎన్‌బీఎస్) పథకంలో భాగంగా వర్తింపచేస్తున్నారు. రైతులకు మేలు చేసే దృష్టితో, గిట్టుబాటు ధరలకు ఫాస్ఫేట్, పొటాషియం ఎరువులను రైతులకు అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది.

ఎరువులతో పాటు యూరియా, డీఏపీ, ఎమ్ఓపీ, సల్ఫర్ వంటి ఇన్‌పుట్ల అంతర్జాతీయ ధరల్లో ఇటీవలి ధోరణులను గమనించి, 2026 ఖరీఫ్ సీజనుకు ఫాస్ఫేటిక్, పొటాషిక్ ఎరువులపై (డీఏపీ, ఎన్‌పీకేఎస్ గ్రేడ్లు సహా) పోషకాధారిత సబ్సిడీ రేట్లను 01.04.2026 నుంచి 30.09.2026 వరకు ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.




# అమ్మ భాషే కంటి చూపు

## -భారతీయతే మన అసలైన గుర్తింపు
## -మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఉద్బోధన



చిత్తూరు, ఏప్రిల్ 9: మాతృభాషపై అపారమైన మమకారం, భారతీయతపై గర్వభావం, విద్యార్థుల జీవితంపై విలువల బోధన ఈ మూడింటిని సమన్వయపరుస్తూ భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు చిత్తూరులో విద్యార్థినులను ఉత్తేజపరుస్తూ ప్రసంగించారు.

చిత్తూరులోని ఎన్ పి సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన 44వ వార్షికోత్సవం, స్నాతకోత్సవం, నూతన వసతి భవనం ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ముందుగా హాస్టల్ భవనాన్ని ప్రారంభించి, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు బంగారు పథకాలు, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.

ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగం సభను ఆకట్టుకుంది. మనం ఎక్కడికి వెళ్లినా, ఎలాంటి భాషలు నేర్చుకున్నా ముందుగా మాతృభాషను గౌరవించాలని ఆయన పిలుపునిచ్చారు. మనం తెలుగు వాళ్లమని గర్వంగా చెప్పుకోవాలని, మాతృభాషను మరిచిపోవడం అంటే తల్లిని మరిచిపోయినట్టేనని స్పష్టం చేశారు. కన్నతల్లి, జన్మభూమి, మాతృభాష, మాతృదేశం, గురువును మరచిపోయేవాడు మానవుడే కాదని గుర్తుచేశారు.

అమ్మ భాష కంటి చూపు వంటిదని, ఇంగ్లీష్ భాష కళ్లద్దాల వంటిదని ఆయన ఇచ్చిన ఉపమానం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కంటి చూపు ఉంటేనే కళ్లద్దాలు ఉపయోగపడతాయని, కంటి చూపే లేకపోతే ఎంత ఖరీదైన కళ్లద్దాలు పెట్టుకున్నా ప్రయోజనం లేదని వివరించారు. అందుకే ఇంట్లో, వీధిలో, గుడిలో, బడిలోఎక్కడైనా మన మాతృభాషలోనే మాట్లాడాలని సూచించారు. మన కట్టు, మన బొట్టు, మన బాట, మన ఆట, మన పాట, మన భాష, మన యాస, మన గోస మాత్రమే కాదు, మన భావవ్యక్తీకరణ మొత్తం కూడా తెలుగులోనే ఉండాలని చమత్కారంగా చెప్పారు.

భారతీయతపై మాట్లాడుతూ, భాషలు, వేషాలు, సంస్కృతులు వేరైనా మనమంతా ఒకే దేశానికి చెందిన వారమని పేర్కొన్నారు. ముందుగా నేను భారతీయుడిని అని చెప్పుకోవాలి, ఆ తర్వాతనే ప్రాంతం, భాష, వ్యక్తిగత వివరాలు చెప్పుకోవాలని సూచించారు. వివిధత్వంలో ఏకత్వమే భారత దేశ ప్రత్యేకత అని, అదే మన బలమని అన్నారు.

విద్యార్థుల దినచర్యపై కూడా ఆయన స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ఉదయం సూర్యోదయానికి ముందే నిద్రలేవడం అలవాటు చేసుకోవాలని, ప్రతి రోజూ వ్యాయామం, యోగా చేయాలని సూచించారు. ఇప్పుడు మీరు నడిస్తే రేపు మీ నడత బాగుంటుందని పేర్కొన్నారు. క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ వంటి ఆటల్లో పాల్గొనాలని ప్రోత్సహించారు.

యోగా రాజకీయాల కోసం కాదని, శరీర ఆరోగ్యానికి అవసరమని సరదాగా వ్యాఖ్యానించారు. ఆహారపు అలవాట్లలో మార్పు అవసరమని చెబుతూ, రాగి, జొన్నలు, సజ్జలు వంటి సంప్రదాయ ధాన్యాలను ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. పాలిష్ చేసిన తెల్ల బియ్యం అధికంగా తినడం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

మహిళా విద్యపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన ఆయన, ఒక అబ్బాయిని చదివిస్తే ఒక వ్యక్తి మాత్రమే చదివినట్టే కానీ ఒక అమ్మాయిని చదివిస్తే కుటుంబమంతా చదివినట్టేనని పేర్కొన్నారు. మహిళలు ప్రతి రంగంలో ముందుకు రావాలని, భవిష్యత్తులో రాజకీయాల్లో వారికి మరిన్ని అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కుటుంబ విలువలపై కూడా ఆయన స్పష్టంగా మాట్లాడారు.

తల్లిదండ్రులతో సమయం గడపాలని, ఎప్పుడూ ఫోన్లు, టీవీలతోనే కాలం గడపకూడదని సూచించారు. సామాజిక మాధ్యమాల వినియోగం అధికమై, అవి అసామాజిక మాధ్యమాలుగా మారుతున్నాయని వ్యాఖ్యానించారు. రాత్రి తొందరగా నిద్రపోయి, ఉదయం త్వరగా లేవడం అలవాటు చేసుకోవాలని చెప్పారు.

తన వ్యక్తిగత జీవితాన్ని ఉదాహరణగా చూపిస్తూ, చిన్నప్పుడే తల్లిని కోల్పోయినా తాతయ్య, అమ్మమ్మ ఇచ్చిన విలువల వల్లే ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపారు. చదువులతో పాటు ప్రాపంచిక జ్ఞానం, మంచి విలువలు జీవితంలో ఎంతో అవసరమని అన్నారు. చివరగా విద్యార్థులకు స్పష్టమైన సందేశాన్ని ఇస్తూ విదేశాలకు వెళ్లి నేర్చుకోవాలని, సంపాదించాలని కానీ తిరిగి స్వదేశానికి వచ్చి సేవ చేయాలని సూచించారు. తల్లిదండ్రులను గౌరవించాలని, స్వగ్రామానికి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

మహిళలు రాబోయే అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. జై హింద్ అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఈ కార్యక్రమానికి విచ్చేసిన వెంకయ్య నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళి మోహన్, సీవీడీసీ సెక్రటరీ ఎన్ వి వెంకటేశ్వర చౌదరి తదితరులు కూడా మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, శైలజ తేజోమూర్తి, వెంకటరమణ, డాక్టర్ కే. మనోహర్, డాక్టర్ జి. ఉషారాణి, అధ్యాపకులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నీటి సంరక్షణకు జిల్లా యంత్రాంగం కట్టుబాటు

## -100 రోజుల ప్రత్యేక యాక్షన్ ప్లాన్ అమలు -కలెక్టర్ డా. ఏ. సిరి.



కర్నూలు ఏప్రిల్ 9: జిల్లాలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదల, చెరువుల పునరుద్ధరణ లక్ష్యంగా 100 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి వెల్లడించారు. జలధార నీటి భద్రత కార్యక్రమంలో భాగంగా గురువారం కోసిగి మండలం డి. బెలగల్ గ్రామంలోని చెక్ డ్యామ్, నాగమ్మ చెరువును జాయింట్ కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చెక్ డ్యామ్‌లు, చెరువులను నీటితో నింపేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వాగులు, వంకలలో ఉన్న అడ్డంకులను తొలగించి చెరువులకు నీటి ప్రవాహం సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భూగర్భ జలాల మట్టాన్ని పెంచేందుకు సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి జిల్లాలోని అన్ని మండలాల్లో అమలు చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. కెనాల్స్‌లో ఉన్న నీటిని ఎల్ఎల్సీ, చెరువులతో అనుసంధానం చేసి నీటి నిల్వ సామర్థ్యాన్ని 100 శాతం పెంచేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఫీడర్ కెనాల్స్ పరిస్థితి, వాటి సామర్థ్యం, జంగిల్ క్లియరెన్స్, బండ్ల మరమ్మతులపై సమగ్ర అంచనా వేసి తగిన ఎస్టిమేట్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

కోసిగి మండలంలో చెరువులు, కుంటలు చాలా కాలంగా ఎండిపోయి ఉండడం లేదా పూడిక పేరుకుపోవడం వల్ల నీటి నిల్వ తగ్గిందన్నారు. జిల్లాలో భూగర్భ జలాల సగటు 6.6 మీటర్లు ఉండగా, కోసిగిలో అది 29 మీటర్ల లోతులో ఉండటం ఆందోళనకరమని తెలిపారు. అదే సమయంలో సమీపంలోని పెద్దకడబూరులో కేవలం 2 మీటర్లలోనే నీటి మట్టం ఉండటం గమనార్హమన్నారు. జిల్లా సగటును 4 మీటర్లలోపుకు తీసుకురావడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

డ్వామా, ఇరిగేషన్, వ్యవసాయ, పంచాయతీ రాజ్ శాఖల సమన్వయంతో యాక్షన్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. వీబీజీ రామ్‌జీ పథకం కింద పనులను శాస్త్రీయంగా చేపట్టి భూగర్భ జలాల పెంపుదలపై దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న 246 మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల్లో ఈసారి వర్షాల కారణంగా 75 శాతం కంటే ఎక్కువ నిండాయని తెలిపారు. అయితే కేవలం వర్షాలపై ఆధారపడకుండా వాగులు, వంకలు శుభ్రపరిచి చిన్న కుంటలను నింపగలిగితే బోర్‌బావులు తిరిగి పనిచేసే అవకాశముందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, డ్వామా పీడీ నరసింహ రెడ్డి, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, కోసిగి తహసీల్దార్ వేణుగోపాల్ శర్మ, ఎల్ఎల్సీ చైర్మన్ టిప్పు సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# స్పేస్‌క్రాఫ్ట్ మిషన్ ఆపరేషన్స్, ఎస్ఎంఓపీఎస్-2026 పై అంతర్జాతీయ సదస్సు

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 9: ఇన్నోవేటివ్ ఆపరేషన్స్ ఫర్ స్మార్ట్ అండ్ సస్టైనబుల్ స్పేస్ మిషన్ మేనేజ్‌మెంట్ - నెక్ట్స్ జనరేషన్" ఇతివృత్తంతో "స్పేస్‌క్రాఫ్ట్ మిషన్ ఆపరేషన్స్: ఎస్ఎంఓ పీఎస్-2026" అంతర్జాతీయ సదస్సు రెండవ ఎడిషన్, 2026 ఏప్రిల్ 8 నుంచి 10 వరకు బెంగళూరులో జరుగుతోంది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో), ఆస్ట్రోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) ఇంటర్నేషనల్ అకాడమీ ఆఫ్ ఆస్ట్రోనాటిక్స్ (ఐఏఏ) సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సు, అంతరిక్ష యాత్రల నిర్వహణ, అధునాతన మిషన్ డిజైన్, స్వయంచాలక వ్యవస్థలు, భారీ ఉపగ్రహ సమూహాల నిర్వహణ, మానవ సహిత అంతరిక్ష యాత్రలు, స్పేస్ రోబోటిక్స్, అంతరిక్ష విధానం, చంద్ర, గ్రహాంతర అన్వేషణ, అంతరిక్ష వ్యవస్థలలో సైబర్ భద్రత, కృత్రిమ మేధ, గ్రౌండ్ స్టేషన్ కార్యకలాపాలలో ప్రస్తుత, భవిష్యత్తు ధోరణులు వంటి అనేక అంశాలను చర్చిస్తుంది. అంతరిక్ష రంగంలోని అప్-స్ట్రీమ్, డౌన్-స్ట్రీమ్ విభాగాలలో భవిష్యత్ సాంకేతికతలను గురించి కూడా ఈ సదస్సు చర్చిస్తుంది. ఎస్ఎమ్ఓపిఎస్ లో భాగంగా 10వ తేదీన విద్యార్థులు, యువ నిపుణుల కోసం ఒక ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తారు.

ఇస్రో మాజీ చైర్మన్/డిఓఎస్ కార్యదర్శి శ్రీ ఏ ఎస్ కిరణ్ కుమార్ ఈ రోజు సదస్సును ప్రారంభించారు. ఇస్రో చైర్మన్/డిఓఎస్ కార్యదర్శి డాక్టర్ వి. నారాయణన్, యుఆర్ఎస్సి డైరెక్టర్ శ్రీ ఎం. శంకరన్, ఐఏఏ సెక్రటరీ జనరల్ డాక్టర్ జీన్ మిచెల్ కాంటాంట్, ఇస్ట్రాక్ డైరెక్టర్ డాక్టర్ ఏకే అనిల్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సదస్సులో 120 మౌఖిక, 88 పోస్టర్ ప్రెజెంటేషన్లతో పాటు, ఈఎస్ఏసీఎన్ఈఎస్, డీఎల్ఆర్, ఐబీఎమ్పో, రష్యాకు చెందిన ఐకేఐ, నాసా, జాక్సా, సెలెస్ట్రాక్, యూమెట్‌శాట్, యూటెల్‌శాట్, టీయూ డెల్ఫ్ట్, కెనడా వంటి సంస్థల నుంచి నుండి ప్రముఖ నిపుణులు ముఖ్య వక్తలుగా, ప్యానెలిస్టులుగా పాల్గొన్నారు. వేగంగా మారుతున్న అంతరిక్ష రంగంలో అత్యాధునిక సాంకేతికతలు, ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవడంపై అంతరిక్ష సంస్థలు, స్టార్టప్‌లు, పరిశ్రమలు, విద్యాసంస్థలు తమ అభిప్రాయాలను పంచుకోవడానికి ఈ సదస్సు ఒక అద్భుతమైన వేదికగా నిలిచింది. సదస్సు చివరి రోజున అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంపై రోబోటిక్ మిషన్ ఆపరేషన్స్, స్పేస్ డొమైన్ అవేర్నెస్, అంతరిక్ష అనువర్తనాలు, మానవ అంతరిక్ష యాత్రలు, వ్యోమగాముల శిక్షణపై ఆహ్వానిత ప్రసంగాలతో కూడిన వర్క్‌షాప్ ఉంటుంది. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో ప్రతినిధులు పాల్గొంటారు.

ఇస్రో చైర్మన్ తమ ప్రారంభోపన్యాసంలో, అంతరిక్ష ప్రయోగాల విజయం కోసం వ్యోమనౌక మిషన్ కార్యకలాపాల విషయంలో అత్యంత జాగ్రత్తతో కూడిన ప్రణాళిక, లోప రహిత అమలు కీలక పాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు. అంతరిక్ష రంగంలో ఎదురవుతున్న సవాళ్లకు వినూత్న పరిష్కారాలను కనుగొనడంలో, భారతీయ అంతరిక్ష రంగం ప్రపంచ దేశాలతో చురుకుగా భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు.

సాంకేతిక, విధానపరమైన అంశాల నుంచి ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా అధిగమించడం ప్రధాన ఇతివృత్తాలలో ఒకటి. విచ్ఛిన్నకర సాంకేతిక ఆవిష్కరణలు, భారీ ఉపగ్రహ సమూహాల రాక, అంతరిక్ష ట్రాఫిక్ రద్దీ పెరగడం, భూమికి ఆవల సాహసోపేతమైన మానవ అంతరిక్ష పరిశోధనల వంటి కారణాల వల్ల... విభిన్నమైన, విస్తృతమైన మిషన్ నిర్వహణ అంశాల సంక్లిష్టత మరింత పెరుగుతోంది. మనుషులు, యంత్రాల మధ్య సమన్వయంతో మరింత స్వయంప్రతిపత్తి కలిగిన, సమర్థవంతమైన మిషన్ కార్యకలాపాలను నిర్వహించడంలో కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ పోషించే కీలక పాత్రను ఈ సందర్భంగా జరిగిన సెషన్లలో వివరించారు.

ఆర్యభట్ట ఉపగ్రహం నుంచి నిసార్ వరకు, భూమికి దగ్గరగా ఉండే కక్ష్యలు అలాగే సుదూర అంతరిక్ష ప్రయోగాల కార్యకలాపాలకు కేంద్రమైన ఇస్ట్రాక్ ఎన్నో అద్భుత విజయాలను సాధించింది. చారిత్రాత్మక మంగళయాన్ మిషన్, చంద్రయాన్-3 సురక్షిత ల్యాండింగ్, సూర్యుడి చుట్టూ ఉన్న లాగ్రాంజియన్ పాయింట్ వద్ద ఆదిత్య-ఎల్1 నౌకను ప్రవేశపెట్టడం, స్పేడెక్స్ మిషన్ డాకింగ్ ప్రయోగాలు వంటివి ఇందులో ప్రధానమైనవి. ఈ ఎస్ఎమ్ఓపీఎస్ సదస్సు నిర్వహణలో ఇస్ట్రాక్ కీలక పాత్ర పోషిస్తోంది. భారత అంతరిక్ష రంగం ప్రైవేటు సంస్థలకు అందుబాటులోకి రావడం, ఇస్రో మానవ అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, ఈ ఎస్ఎమ్ఓపీఎస్ సదస్సు వివిధ రంగాలకు చెందిన ఆలోచనల కలయికగా నిలిచింది. భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాల నిర్వహణ కోసం సురక్షితమైన, స్థిరమైన, తెలివైన ప్రణాళికను రూపొందించే క్రమంలో ప్రపంచ అంతరిక్ష సమాజం మధ్య పరస్పర సహకారం, భాగస్వామ్యాలను పెంపొందించడానికి ఇది ఒక వేదికగా మారింది.

# ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలి..

## -మత్స్యకారుల డిమాండ్

నల్గొండ, ఏప్రిల్ 9:మత్స్యకారులను మంథని మండలం గుంజపడుగు పంప్ హౌస్ వద్ద చేపలు పట్టుకోకుండా అడ్డుకొని ఆవేదన వ్యక్తం చేశారు.

చేపలు పట్టడానికి పర్మిషన్ తీసుకున్నప్పటికీ మాకు ఇలాంటి నోటీసులు ఇవ్వకుండానే మహాసభ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు వీరబోయిన



చేపలు చనిపోవడానికి కారణమైన ఇరిగేషన్ అధికారుల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు గురువారం కోరారు. చేపలు పట్టడానికి అనేకమైన నిబంధనలు విధిస్తున్నారని మమ్మల్ని అడ్డుకుంటూ చేపల మృతికి కారణమైన అన్నారం పంప్ హౌస్ ఇరిగేషన్ అధికారులపైన తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ రాజేందర్, సాధుల సదానందం ,సాధుల ఓదెలు, ఉదరి శివ, నూనె చంద్రయ్య, సాదుల తిరుపతి, కందుల శంకర్, సాదుల శ్రీకాంత్, అనవేన సదానందం, దశరథం తదితరులు ఉన్నారు.

# ముంపు గ్రామాలను తరలించి పునరావాసం కల్పిస్తాం

## -రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్, ఆంధ్రప్రభ ; భీమా ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన సంగంబండ ,భూత్పూర్ రిజర్వాయర్ల కింద పంపు గ్రామాలైన భూత్పూర్ ,నేరేడుగం ముంపు గ్రామాలను తరలించి పునరవాసం కల్పిస్తామని రాష్ట్ర పరిశ్రమవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. భూత్పూర్ ను ముంపు గ్రామంగా ప్రకటించడానికి చాలా కష్టపడాల్సి వచ్చిందన్నారు. భూతత్పూర్ పునరావాసం కల్పిస్తామని చెప్పారు.

గురువారం మక్తల్ మండలంలోని భూత్పూర్ నుండి కొత్తపల్లి గ్రామానికి కోటి యాభై లక్షల రూపాయలతో నిర్మించతలపెట్టిన బ్రిడ్జి నిర్మాణానికి మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపటి నుండే బ్రిడ్జి పనులు ప్రారంభం అవుతున్నాయని తెలిపారు. అతి త్వరలో వంతెన ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. నమ్మకం తో నన్ను ఎమ్మెల్యే గా గెలిపించుకున్న ఈ ఊరి కోసం చాలా శ్రద్ధ తీసుకుంటున్నానని తెలిపారు.

భూతత్పూర్ ను ముంపు గ్రామంగా ప్రకటించడానికి చాలా కష్టపడ్డానని తెలిపారు. ముంపు గ్రామంగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. త్వరలో నేరేడుగం, భూత్పూర్ గ్రామాలను తరలించి ఆయా గ్రామాల ప్రజలు సంతోషంగా జీవించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మంత్రి వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో భూత్పూర్ గ్రామ సర్పంచ్ సంగీత శేఖర్ గౌడ్ , మాజీ ఎంపిపి గడ్డంపల్లి హన్మంతు, మాజీ ఎంపిటిసి కుర్మయ్య గౌడ్ ,మక్తల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బి.గణేష్ కుమార్ నాయకులు కట్ట సురేష్ కుమార్ గుప్తా, భీమ్ సేన్ రావు ,రఘుపతి రెడ్డి, రాఘవేందర్ రెడ్డి ,బత్తలయ్య, గడ్డం రమేష్, కె.కృష్ణయ్య గౌడ్ ,చెన్నయ్య గౌడ్,జెడ్పి సీఈవో మొగులప్ప ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జోగినీలకు పునరావాసం కల్పించాలి- మంత్రి శ్రీహరికి వినతి

ఆదిలాబాద్, ఏప్రిల్ 9:జోగినిలకు ప్రభుత్వం పునరావాసం కల్పించాలని కోరుతూ రాష్ట్ర పాడి పరిశ్రమల మత్స్య క్రీడలు యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరికి ఓ యం ఐఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ హాజమ్మ ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం సమర్పించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో జోగినీలు చాలామంది ఇండ్లు భూమి పెన్షన్ పునారావాసం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివిధ పత్రంలో పేర్కొన్నారు.

ప్రభుత్వం అర్హులైన జోగినిలందరికీ న్యాయం చేస్తూ వారి పిల్లలకు చేయూత అందించి ప్రభుత్వం అన్ని రకాలుగా జోగినీలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జోగిని వ్యవస్థ నిర్మూలనకు కృషి చేస్తున్నామని జోగినిల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు డి. యజ్ఞేశ్వర్,రెడ్డి, మాజీ జెడ్పిటిసి సూర్యప్రకాశ్ రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కోరం మహేష్ రెడ్డి, అధ్యక్షులు కొక్కు లింగం, వార్డు సభ్యులు కొక్కు మల్లేష్, పల్లె అనిల్ రెడ్డి,

# దళితరత్న అవార్డు గ్రహీత మావాలే దత్తకు సన్మానం

జైనూర్, ఏప్రిల్ 9: కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా మాంగ్ సమాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మావాలే దత్తకు గురువారం మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు.

అసోసియేషన్ అధ్యక్షుడు కాంబ్లే బాబాసాహెబ్ ఆధ్వర్యంలో మావాలే దత్తకు శాలువా కప్పి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సమాజంలో ఆయన చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం దళిత రత్న అవార్డుతో సత్కరించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవలు కొనసాగిస్తూ మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

అవార్డు గ్రహీత మావాలే దత్త మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ఈ గౌరవం అందించడం గర్వకారణమని, ఇదే స్ఫూర్తితో సమాజానికి మరింత సేవ చేస్తానని తెలిపారు. ప్రభుత్వం, సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# పారిశుద్ధ్యం పరిశుభ్రతపై అవగాహన




చౌటుప్పల్, ఏప్రిల్ 9: చౌటుప్పల్ మండల మహిళా సమాఖ్య భవనంలో గ్రామ సంఘ అసిస్టెంట్లకు నీరు పారిశుద్ధ్యం పరిశుభ్రత కార్యక్రమం పైన తెలంగాణ మహిళా అభివృద్ధి సొసైటీ ఆధ్వర్యంలో గురువారం మహిళలకు శిక్షణ శిబిరం నిర్వహించారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా సమాజంలో సురక్షితమైన నీరు పారిశుధ్యం పై అవగాహన పెంచడం, సభ్యుల మధ్య ఆర్థిక అడ్డంకులను తొలగించి సురక్షితమైన నీరు, పారిశుధ్యం పొందడం కోసం అందించేలా చూడడం అనే విషయం పైన శిక్షణ ఇచ్చారు.

ఈ శిక్షణా కార్యక్రమంలో డిఆర్డిఏ అడిషనల్ డి ఆర్ డి ఓ కోట జంగారెడ్డి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అలివేలు, కార్యదర్శి, కోశాధికారి ఏ.పి.ఎం యాదయ్య, సీసీలు విమల, నరసింహ, కల్పన, గ్రామ సంఘం అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# వస్త్ర వ్యర్థాలను ప్రజలు, పర్యావరణానికి అనుకూలమైన అవకాశాలుగా మారుస్తున్న నవీ ముంబయి

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 9:నవీ ముంబయిలోని వస్త్ర పునరుద్ధరణ కేంద్రం (టీఆర్ఎఫ్) చక్రీయ వ్యవస్థలు, ప్రజా భాగస్వామ్యం ద్వారా వస్త్ర వ్యర్థాలను అద్భుతమైన అవకాశాలుగా మారుస్తోంది. స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0 కింద చేపట్టిన ఈ కార్యక్రమం.. వ్యర్థాలు డంపింగ్ యార్డులకు చేరటాన్ని తగ్గించడమే కాకుండా ఉపాధి అవకాశాలను సృష్టిస్తోంది. ఇది పట్టణ భారత్‌కు ఒక ఆదర్శవంతమైన, విస్తరించదగిన నమూనాగా నిలుస్తోంది.

భారతదేశంలో ప్రతి ఏటా దాదాపు 7.8 మిలియన్ మెట్రిక్ టన్నుల మేర వినియోగానంతర వస్త్ర వ్యర్థాలు వస్తున్నాయి. ఇది మన ఇళ్లు, సంస్థలు, పరిశ్రమలలో వాడే రకరకాల వస్త్రాల స్థాయిని తెలియజేస్తోంది. చీరలు, యూనిఫారాల నుండి డెనిమ్, లైనెన్ వరకు పట్టణ వ్యర్థాల్లో వస్త్రాలు ఒక ముఖ్యమైన భాగం అయినప్పటికీ తరచుగా వీటిని ఎవరూ పట్టించుకోరు. వస్త్రాల పునరుద్ధరణ, పునర్వినియోగం, రీసైక్లింగ్ కోసం క్రమబద్ధమైన వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని నగరాలు ఇప్పుడు గుర్తిస్తున్నాయి. చక్రీయ ఆర్థిక వ్యవస్థ, వనరుల సామర్థ్యంపై పెరుగుతున్న ఆసక్తితో ఈ వస్త్రాలు డంపింగ్ యార్డులకు చేరకుండా నిరోధించే వినూత్న పరిష్కారాలను అన్వేషించటాన్ని మున్సిపాలిటీలు ప్రారంభించాయి.

పట్టణ స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 కింద నవీ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (ఎన్ఎంఎంసీ) ఈ రంగంలో దేశానికే మార్గదర్శిగా నిలిచింది. వస్త్ర వ్యర్థాల సమస్యను ఒక వ్యవస్థీకృత జోక్యం ద్వారా పరిష్కరించే అవకాశాన్ని గుర్తించిన ఎన్ఎంఎంసీ.. నవీ ముంబయిలోని బేలాపూర్‌లో భారతదేశపు మొట్టమొదటి మున్సిపల్ వస్త్ర పునరుద్ధరణ కేంద్రాన్ని (టీఆర్ఎఫ్) ఏర్పాటు చేసింది. వికేంద్రీకృత సేకరణ, శాస్త్రీయ వర్గీకరణ, ట్రేసబిలిటీ (జాడను గుర్తించే విధానం), మహిళా నేతృత్వంలోని జీవనోపాధి కల్పనను సమన్వయం చేయడం ద్వారా ఈ టీఆర్ఎఫ్ కేంద్రం ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోని వస్త్ర వ్యర్థాలను పట్టణ చక్రీయ ఆర్థిక వ్యవస్థలో ఒక విలువైన భాగంలా మార్చింది.

నవీ ముంబయిలోని వస్త్ర పునరుద్ధరణ కేంద్రం (టీఆర్ఎఫ్) కేవలం ఒక సాధారణ సేకరణ కేంద్రంగా మాత్రమే కాకుండా సేకరణ, వర్గీకరణ, సాంకేతికత, జీవనోపాధి కల్పనలను సమన్వయం చేసే ఒక సమగ్ర చక్రీయ వ్యవస్థగా తయారైంది.

ఈ నమూనా వికేంద్రీకృత సేకరణతో ప్రారంభమవుతుంది. ఇందులో భాగంగా మొత్తం 8 మున్సిపల్ వార్డులలోని హౌసింగ్ సొసైటీలలో వ్యూహాత్మకంగా బ్రాండెడ్ వస్త్ర సేకరణ డబ్బాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 140 డబ్బాలను అందించగా, ప్రస్తుత దశలో వీటి సంఖ్యను 250కి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తద్వారా క్షేత్రస్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో పాటు ఈ సౌకర్యం అందరికీ అందుబాటులో ఉండేలా చూసుకుంటున్నారు.

బేలాపూర్‌లోని ఒక పాత పట్టణ ఆరోగ్య కేంద్రం భవనంలో ఏర్పాటు చేసిన ఈ తాత్కాలిక టీఆర్ఎఫ్ కేంద్రంలో శాస్త్రీయ వర్గీకరణ, ట్రేసబిలిటీపై ప్రధానంగా దృష్టి సారించారు. సేకరించిన వస్త్రాలను ఇక్కడ తూకం వేసి ట్యాగ్‌లు ఇచ్చి పద్ధతి ప్రకారం వివిధ విభాగాలుగా వర్గీకరిస్తారు. వీటిని పునర్వినియోగం, రీసైకిల్, అప్‌సైకిల్, డౌన్ సైకిల్, పనికిరాని వ్యర్థాలు అనే విభాగాలుగా వేరు చేస్తారు. ఇక్కడ వినియోగిస్తున్న 'కోశ' హ్యాండ్ హెల్డ్ స్కానర్ ద్వారా వస్త్రంలోని దారం రకాన్ని.. అంటే కాటన్, పాలీకాటన్, పాలిస్టర్, ఉన్ని, పట్టు వంటి వాటిని ప్రత్యక్షంగా గుర్తించడం సాధ్యమవుతుంది. దీనివల్ల శాస్త్రీయ వర్గీకరణ మరింత బలోపేతం అవ్వడమే కాకుండా వస్త్రాల నుంచి గరిష్ఠంగా ఉపయోగకరమైన పదార్థాలను వెలికితీయడం సులభతరమవుతుంది.

దాత నుంచి తుది ఉత్పత్తి వరకు వస్త్రాలు ప్రయాణించే మార్గాన్ని మ్యాపింగ్ చేయడానికి అభివృద్ధి చేస్తున్న ప్రత్యేక ఎంఐఎస్ వేదికతో కూడిన 'డిజిటల్ ట్రాకింగ్' విధానం పారదర్శకత- బాధ్యతను.. డేటా ఆధారిత నిర్ణయాలను మరింత బలోపేతం చేస్తుంది. వస్త్రాలను గుర్తించిన తర్వాత తదుపరి ప్రక్రియను సులభతరం చేయడానికి వాటిని ఫ్యాబ్రిక్ రకం, రంగు, స్థితి ఆధారంగా వేరుచేస్తారు. వర్గీకరించిన ఈ వస్తువులను పునర్వినియోగానికి పంపే ముందు పరిశుభ్రత, భద్రతను నిర్ధారించడానికి వాటిని పూర్తిగా క్రిమి సంహారం చేస్తారు.

అనువైన వస్త్రాలను స్వయం సహాయక సంఘాలకు చెందిన నైపుణ్యం కలిగిన మహిళలు తమ చేతులతో సంచులు, చాపలు, యాక్సెసరీస్, దుస్తులు, గృహ అలంకరణ వస్తువులుగా మారుస్తారు. ఇలా తయారు చేసిన ఉత్పత్తులను తదనంతరం బహిరంగ మార్కెట్లో విక్రయిస్తారు. దీనివల్ల ఒకప్పుడు వ్యర్థాలుగా భావించిన వస్తువులకు కొత్త రూపం, ప్రయోజనం చేకూరుతుంది.

300 కంటే ఎక్కువ మంది మహిళలు 8 రోజుల పాటు సాగే వ్యవస్థీకృత 'ట్రైనింగ్-ఆఫ్-ట్రైనర్స్' మాడ్యూల్స్‌లో శిక్షణ పొందారు. ఇందులో దారాల గుర్తింపు, వర్గీకరణ నియమాలు, మరమ్మత్తు పద్ధతులు, తయారీ నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం 150 మందికి పైగా మహిళలు వస్త్రాల వర్గీకరణ, కుట్టుపని, ఉత్పత్తుల తయారీ ద్వారా నెలకు రూ. 9,000 నుంచి రూ. 15,000 వరకు ఆదాయాన్ని గడిస్తున్నారు.

ఇది ఒక విప్లవాత్మక మార్పును తీసుకువచ్చింది. గృహిణులు నైపుణ్యం కలిగిన 'చక్రీయ ఆర్థిక వ్యవస్థ' నిపుణులుగా ఎదగడానికి ఇది తోడ్పడింది. ఈ కేంద్రం ఒక ప్రత్యేకమైన అప్‌సైక్లింగ్ కేంద్రంగా పనిచేస్తోంది. ఇక్కడ స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులు సేకరించిన వస్త్రాల నుంచి సంచులు, దుస్తులు, పౌచ్‌లు, గృహ అలంకరణ వస్తువులను తయారు చేస్తున్నారు.

వస్త్ర పునరుద్ధరణ అనేది ఇప్పుడు ఒక క్రమబద్ధమైన జీవనోపాధి యంత్రంగా రూపాంతరం చెందింది. ఇది పర్యావరణహిత ఉద్యోగాలను సృష్టిస్తూ స్థానిక వ్యాపారాలను బలోపేతం చేస్తూ పట్టణ సుస్థిరతా చట్రంలో శ్రమకు ఉండే గౌరవాన్ని చాటిచెబుతోంది.

టీఆర్ఎఫ్ నమూనా ద్వారా ఇప్పటివరకు 30 మెట్రిక్ టన్నుల (ఎంటీ) ఉపయోగించిన వస్త్రాలకు సంబంధించిన వ్యర్థాలను సేకరించగా అందులో 25.5 మెట్రిక్ టన్నులను శాస్త్రీయంగా వర్గీకరించారు. రోజుకు సగటున దాదాపు 500 వస్తువుల చొప్పున మొత్తం 41,000 కంటే ఎక్కువ వస్తువులుగా మార్చారు. అవగాహన కార్యక్రమాల ద్వారా ఈ వస్త్రాల పునరుద్ధరణ కార్యక్రమం 1,14,575 కంటే ఎక్కువ కుటుంబాలకు చేరువైంది. 75 కంటే ఎక్కువ ఐఈసీ వర్క్‌షాప్‌లను నిర్వహించడంతో పాటు 350 మందికి పైగా హౌసింగ్ సొసైటీ ప్రతినిధులను ఈ ప్రక్రియలో భాగస్వాములను చేశారు. ఇది ప్రజల చురుకైన భాగస్వామ్యం, సంస్థాగత నిశ్చయతను తెలియజేస్తోంది.

## సీఆర్పీఎఫ్ శౌర్య దినోత్సవం సందర్భంగా అమరులకు నివాళి అర్పించిన కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 9:సీఆర్పీఎఫ్ శౌర్య దినోత్సవం సందర్భంగా.. కేంద్ర రిజర్వు పోలీసు బలగాల (సీఆర్పీఎఫ్) అమర వీరులకు కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా నివాళి అర్పించారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో శ్రీ అమిత్ షా ఇలా పేర్కొన్నారు: – "సీఆర్పీఎఫ్ శౌర్య దినోత్సవం సందర్భంగా మన వీర సైనికుల అకుంఠిత ధైర్యసాహసాలకూ, త్యాగాలకూ ప్రణమిల్లుతున్నాను. 1965లో ఇదే రోజున సీఆర్పీఎఫ్ వీర యోధులు వెన్నుచూపకుండా పోరాడారు. చొచ్చుకొస్తున్న శత్రుమూకలను అణచివేస్తూ.. రాణ్ ఆఫ్ కచ్ లోని సర్దార్ పోస్టు వద్ద దుర్భేద్యమైన కుడ్యంలా ఎదురు నిలిచారు. ధైర్యసాహసాలతో దేశ చరిత్రలో అద్భుతమైన అధ్యాయాన్ని లిఖించారు. దేశ గౌరవం, భద్రత కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు మనఃపూర్వకంగా నివాళి అర్పిస్తున్నాను."

## అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల ఏర్పాటుకు కృషి

హైదరాబాద్, ఏప్రిల్ 9:అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో అద్దె భవనాల్లో కొనసాగుతోన్న అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. గురువారం గోల్నాక క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం నుంచి మంజూరైన స్మార్ట్ ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 34 అంగన్‌వాడీ కేంద్రాల్లో ముఖ్యంగా మౌలిక వసతుల కల్పనతో పాటు చిన్నారులకు నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పతి కేంద్రంలో చిన్నారులకు ప్రీ ప్రైమరీ విద్య, పౌష్టిక ఆహారంతో పాటు గర్భిణిలు, బాలింతలకు సముచిత పౌష్టికాహారంపై దృష్టి సారించామని అన్నారు. నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న 9 మంది టీచర్లను భర్తీ చేయలాని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శారద, శ్వేత తో పాటు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలి : ఎస్పీ నరసింహ



నల్గొండ, ఏప్రిల్ 9:వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్, నియమ నిబంధనలు, సూచనలు పాటించాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు. జిల్లా కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాట్లకు సంభందించి కొత్త బస్టాండ్ వద్ద సంబంధిత అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. బస్టాండ్ ప్రాంగణంలో రహదారులపై ఉన్న ట్రాఫిక్ రద్దీని, రోడ్ల వెంబడి నిర్వహిస్తున్న వ్యాపార సముదాయాలను సందర్శించారు. వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్ ను అనుసరించేలా ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో రోజు రోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ దృష్ట్యా పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు ట్రాఫిక్ పునరుద్ధరణ, ట్రాఫిక్ నియంత్రణ చేస్తూ ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తుందన్నారు. ఈ సందర్భం గా అధికారులకు పలు సూచనలు సలహాలు అందించారు. ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాట్ల పనులను వేగంగా పూర్తి చేయాలని, మున్సిపల్ శాఖ అధికారులతో సమన్వయంగా పనిచేయాలని సూచించారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించేలా ప్రజలను వాహనదారులను ముందస్తుగా అప్రమత్తం చేయాలని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ పునరుద్ధరణకు సంబంధించి అన్ని రకాల చర్యలను తీసుకోవాలని, ఆర్టీసీ అధికారులను సంప్రదించి జిల్లా కేంద్రంలో, కొత్త బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సుల రాకపోకలు, మార్గాలను సులభతరం చేయాలని తెలిపారు. సూర్యాపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి పోలీస్ సిబ్బందిని బలోపేతం చేస్తామని అన్నారు. వాహనదా రులు ట్రాఫిక్ నియమాలు రోడ్డు నియమాలు పాటించి రోడ్డు ప్రమా దాలకు గురవకుండా సురక్షితంగా గమ్యం చేరుకోవాలని అన్నారు. వ్యాపారస్తులు రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించకూడదని దీనివల్ల ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్ర మంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం పాల్గొన్నారు.

## ఆసిఫ్‌నగర్ కాల్వకు తక్షణం మరమ్మతులు చేపట్టాలి : తుమ్మల వీరారెడ్డి

నల్గొండ, ఏప్రిల్ 9:నార్కట్‌పల్లి మండలం అక్కెనపల్లి నుంచి కట్టంగూరు మండలం వరకు విస్తరించిన ఆసిఫ్‌నగర్ కాల్వకు తక్షణం నిధులు కేటాయించి పూడిక తొలగించి మరమ్మతులు చేపట్టాలని సిపిఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కట్టంగూరు మండలంలోని పరడ గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆయన కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1905లో నవాబ్ కాలంలో నిర్మించిన ఈ కాల్వకు ఇప్పటవరకు ప్రభుత్వాలు సరైన నిధులు కేటాయించకపోవడం వల్ల పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. కట్టంగూరు మండలంలోని సుమారు 15 గ్రామాలకు చెందిన 5,000 ఎకరాలకు ఈ కాల్వ ద్వారా సాగునీరు అందుతుందని తెలిపారు. ప్రస్తుతం కాల్వ చెట్లు, మట్టి, పూడికతో నిండిపోవడంతో పాటు గేట్లు కూడా శిథిలావస్థకు చేరాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపించి కాల్వ మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## కార్మికులకు లేబర్ కార్డుతో ఆర్థిక భరోసా : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 9: పని చేస్తేనే పూట గడిచే కార్మికులకు లేబర్ కార్డుతో ఆర్థిక భరోసా లభిస్తుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మచ్చబొల్లారం డివిజన్ మార్కెట్‌లో సురేష్ సేవాసమితి ఆధ్వర్యంలో చలివేంద్రం, అర్హులైన కార్మికులకు లేబర్ కార్డులను ఎమ్మెల్యే చేతుల మీద అందజేశారు. కానాజీగూడాలో సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని 26 సంవత్సరాల నుండి బొల్లారం మార్కెట్ కు వచ్చే ప్రజలకు దాహం తీర్చేందుకు ఎంతో బాసటగా నిలుస్తుందన్నారు.

నార్ల సురేష్ ఎన్నో సామాజిక సేవలు అందిస్తున్నందుకు సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, ప్రశాంత్ రెడ్డి, మహేశ్, చరణ్‌గిరి, అతిక్‌పాషా, నర్సింగ్ రావు,శంకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటేష్, సరిత తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలి : డా.నవ జ్యోతి

నల్గొండ, ఏప్రిల్ 9: స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలని డా.నవ జ్యోతి అన్నారు. చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామ పంచాయతీలో

జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఈద్ మిలాఫ్" కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్ని మాట్లాడారు. కుల మతాలకు అతీతంగా ఇలా మహిళలంతా కలిసి ఒకరి పండుగలను, సంస్కృతులను మరొకరు పంచుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ ఉపాధ్యాయురాలు లక్ష్మి మాట్లాడుతూ ప్రతి స్త్రీ కి విద్యా జ్ఞానం తప్పనిసరి అని, విద్యావంతురాలు అయినా మహిళల వల్ల సమాజ సంస్కరణ సాధ్యం అన్నారు. సేవా సమితి సభ్యురాలు సత్యావతి మాట్లాడుతూ., కుల మతాలకు అతీతంగా జమాతే ఇస్లామి హింద్ వైద్య, విద్యా, వివాహాలకు సహాయం చేస్తూ చేస్తున్న సేవలను కొనియాడారు. జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షురాలు మాట్లాడుతూ.. మనందరి సృష్టి కర్త అయినా దేవుడు ఒక్కడే అని, కలసి మెలసి జీవించడంలోనే దైవానుగ్రం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జమాత్ సభ్యులు పర్వీన్ సుల్తాన్, నస్రా, పర్వీన్ బాను, షేహనాజ్, పర్వీన్ షమీం. ఆశ వర్కర్లు జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు సరస్వతీ, ఉపాధ్యాయురాలు రాధా, రజీయా, వార్డు మెంబర్ అరీపా పాల్గొన్నారు.

## ప్రపంచ హోమియోపతి దినోత్సవం- 2026 .. సందర్భంగా 2 రోజుల చర్చావేదికను ప్రారంభించనున్న కేంద్ర మంత్రి శ్రీ ప్రతాప్‌రావ్ జాదవ్

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 9:ఆయుష్ మంత్రిత్వ శాఖ 2026 సంవత్సరం ఏప్రిల్ 10న 'ప్రపంచ హోమియోపతి దినోత్సవం' సందర్భంగా ఢిల్లీ లోని విజ్ఞాన్ భవన్లో రెండు రోజుల పాటు సాగే చర్చావేదికను ఏర్పాటు చేయనుంది. విధాన రూపకర్తలు, పరిశోధకులు, అభ్యాసకులు, ప్రతినిధులు సుస్థిర ఆరోగ్యసంరక్షణ వ్యవస్థను తీర్చిదిద్దడంలో హోమియో వైద్యశాస్త్రం పోషిస్తున్న పాత్ర నానాటికీ విస్తరించడంపై తమ ఆలోచనలను ఈ కార్యక్రమంలో పంచుకొంటారు.

"నిలకడైన ఆరోగ్యం కోసం హోమియోపతీ" ఇతివృత్తం ప్రధానంగా ఈ సంవత్సరంలో నిర్వహించబోయే ఉత్సవంలో, స్వాస్థ్య సేవల్ని అందించడానికి హోమియోపతీ సమగ్రమైన, తక్కువ ఖర్చుతో కూడిన, పర్యావరణం పరంగా బాధ్యత కలిగిన దృష్టికోణంతో ముందుకు పోతోందని చాటిచెబుతారు. అలాగే, అందరికీ స్వాస్థ్య సంరక్షక సేవల్ని అందించడం, ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) వంటి ప్రపంచ ప్రాధాన్యాలు, ప్రత్యేకించి చక్కని ఆరోగ్యం, సంక్షేమం అంశాలపై ఎస్‌డీజీ 3 ఏం చెబుతోందనే అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు.

కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్‌రావ్ జాదవ్, ఆయుష్ శాఖ కార్యదర్శి శ్రీ వైద్య రాజేశ్ కొటేచా, ప్రభుత్వ సీనియర్ అధికారులతో పాటు దేశవ్యాప్తంగా ప్రముఖ నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రిసర్చ్ ఇన్ హోమియోపతీ (సీసీఆర్‌హెచ్) నిర్వహించే ఈ కార్యక్రమంలో.. హోమియోపతీ రంగంలో విశేష పరిశోధనల రీత్యా చోటు చేసుకున్న ప్రగతి, ప్రజారోగ్య కార్యక్రమాలు, విధానపరమైన అభివృద్ధి వంటి వాటిని వివరిస్తారు. దీనిలో విజ్ఞానశాస్త్ర రీత్యా చెల్లుబాటునూ , నైతిక ప్రమాణాలనూ పటిష్ఠపరచడం, ప్రధానస్రవంతికి చెందిన ఆరోగ్యసంరక్షణ వ్యవస్థలతో హోమియోపతీని ఏకీకరించడంపైన కూడా చర్చిస్తారు.

ఆరోగ్యసంరక్షణకు సంబంధించిన ఖర్చులు రోజురోజుకూ పెరిగిపోతుండడం, పాత రోగాల తాలూకు భారం అధికమవడం, సూక్ష్మజీవినాశక మందులకు ఎదురొడ్డి నిలిచే వ్యవస్థ మనుషుల శరీరాల్లో బలపడుతుండడం (యాంటిమైక్రోబియల్ రెసిస్టెన్స్) తదితర ఆందోళనకారక పరిణామాల నేపథ్యంలో, హోమియోపతీని ఒక మన్నిక కలిగిన చికిత్స వ్యవస్థగా ఈ కార్యక్రమం వెలుగులోకి తీసుకురానుంది. కనీస స్థాయి పర్యావరణ పాదముద్ర, వనరులను హేతుబద్ధ రీతిలో ఉపయోగించడంతో పాటు మానవ దేహంలో స్వతస్సిద్ధంగా అమరి ఉన్న ఉపచార యంత్రాంగాన్ని ఉత్తేజితం చేయడం హోమియోపతీ వైద్య విధానంలో కొన్ని ప్రత్యేకతలన్న సంగతి తెలిసిందే.

ప్రత్యేక సమావేశాల్లో నివారక ప్రధాన, ప్రోత్సహపూర్వక ఆరోగ్యసంరక్షణలోనూ, జీవనశైలితో పాటు దీర్ఘకాలిక రోగాల నిర్వహణలోనూ హోమియోపతీ పోషిస్తున్న భూమిక, సాంప్రదాయిక ఔషధచికిత్సపై ఆధారపడడాన్ని తగ్గించడంలో హోమియోపతీ అందిస్తున్న తోడ్పాటునూ పరిశీలించనున్నారు. చర్చల్లో పర్యావరణానుకూల ఔషధ పద్ధతులు, జీవవైవిధ్య సంరక్షణ, సాంప్రదాయిక జ్ఞానాన్ని ఆధునిక విజ్ఞానశాస్త్ర పరిశోధనతో ఏకీకరించడానికి ప్రాధాన్యాన్ని ఇవ్వడం వంటి అంశాలపైన కూడా దృష్టిని కేంద్రీకరిస్తారు.

గత కొన్ని సంవత్సరాల్లో భారత్లోనూ, ప్రపంచ స్థాయిలోనూ విశేషించి సమాజ ఆరోగ్యసంరక్షణ, ప్రజారోగ్య సంబంధిత కార్యక్రమాల్లో హోమియోపతీ వైద్య విధానానికి గతం కన్న మరింత ఎక్కువ ఆదరణ లభిస్తోంది. ఫలితాలపై ఆధారపడ్డ పద్ధతులు, మెరుగైన లభ్యత, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో ఏకీకరణ.. ఈ మార్గాల్లో హోమియోపతీ పరిధిని విస్తరించడానికి ఆయుష్ శాఖ చురుకుగా పని చేస్తోంది.

సాంప్రదాయిక చికిత్స వ్యవస్థలను ప్రోత్సహించడంలో భారత్ నాయకత్వాన్ని మరింత బలపరచడంతో పాటు ఆటుపోట్లకు తట్టుకొని నిలిచే, సమ్మిళిత, మన్నిక కలిగిన ఆరోగ్యసంరక్షక సేవల అనుబంధ విస్తారిత వ్యవస్థను నిర్మించే దిశగా చేస్తున్న కృషికి 'ప్రపంచ హోమియోపతీ దినోత్సవం-2026' ఒక కొత్త వేగాన్ని అందిస్తుందని భావిస్తున్నారు.

ఈ కార్యక్రమం ఆసక్తిదారు వర్గాల నడుమ చర్చలు, సహకారం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుంది. దీంతో స్వాస్థ్య సేవ కేవలం ప్రభావవంతంగా మారడమే కాకుండా సమానావకాశాల్ని అందించే, పర్యావరణం పట్ల చైతన్యాన్ని కలిగి ఉండే మన్నికైన భవిష్యత్తు దిశగా సాగేందుకు కూడా ఈ కార్యక్రమం ఒక బాటను ఏర్పరుస్తుంది.

## రామవరం ప్రాంతానికి యుద్ధ ప్రాతిపదికన మంచినీళ్లు అందించాలి

– సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె షాబీర్ పాషా



ఖమ్మం, ఏప్రిల్ 9: కార్పొరేషన్ పరిధిలోని రామవరం ప్రాంతంలో ఉన్న నీటి ఎద్దడి నివారించేందుకు చర్యలు తీసుకుని యుద్ధ ప్రాతిపదికన మంచినీళ్లు అందించాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా అన్నారు. గురువారం రామవరంలోని కిన్నెరసాని, భగీరథ పనుల పైప్ లైన్లను, నూతన ట్యాంకులను పరిశీలించిరు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రూ.125 కోట్లతో మిషన్ భగీరథ పథకాన్ని మంజూరు చేయించి ప్రజలు మంచినీళ్లకు బాధపడొద్దని కృత నిశ్చయంతో చేసిన పనులకు అధికారుల అలసత్వం ద్వారా పనులు జాప్యం అవుతున్నాయన్నారు. తక్షణమే మిషన్ భగీరథ పనులను పూర్తి చేసి నూతన ట్యాంక్ కి నీళ్లు ఎక్కించి రామవరంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎమ్మెల్యే అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

అలాగే పాత కిన్నెరసాని ట్యాంక్ ద్వారా సాయంత్రానికి నీళ్లు అందించాలని అధికారులకు ఆదేశించినట్లు ఆయన తెలిపారు. అలాగే స్టాండ్ బై మోటార్లను ఏర్పాటు చేసుకొని మంచినీటి సరఫరాలో అవాంతరాలు ఏర్పడకుండా చూసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. అలాగే పైప్ లైన్ జరుగుతున్న ప్రాంతాల్లో శిథిలమైన రోడ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులను ఆయన ఆదేశించారు. పనులను పరిశీలించిన సిపిఐ ప్రతినిధి బృందంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు భూక్యా శ్రీనివాస్, రామవరం బ్రాంచ్ కార్యదర్శి మర్రి గోపి, త్రీ టౌన్ టౌన్ ఏరియా కార్యదర్శి యూసుఫ్, 14,16,17 వ డివిజన్ కార్పొరేటర్స్ సుధాకర్ రాజు, మునిగడప పద్మ, ఎర్రబెల్లి శంకర్, సీనియర్ నాయకులు మాటేటి గోపాల్, సర్పంచ్ నగేష్, రమేష్, అంకుష్ గంటాడి కోటేశ్వరరావు, ఖంపెల్లి దుర్గయ్య, నాగరాజు, శివ ,రాజు ,జగ్గు, చందు, నాగరాజు పాల్గొన్నారు.

## ఆర్వో ప్లాంట్ పేలిన ఘటనలో వ్యక్తి మృతి

హైదరాబాద్, ఏప్రిల్ 9: హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని జలవిహార్‌లో బుధవారం మధ్యాహ్నం సంభవించిన భారీ పేలుళ్ల ఘటనలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. లేక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జలవిహార్ ఆర్వో ప్లాంట్‌లో బుధవారం భారీ పేలుళ్లు జరిగిన విషయం పాఠకులకు విదితమే. అయితే ఈ ఘటనలో ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన లక్ష్మణ్(50) తీవ్ర గాయాలు అవ్వడంతో అతని పోలీసులు సోమాజిగూడలోని జాయ్ హాస్పిటల్‌కు తరలించారు.అతిబిఎ డ ఒనీఇజీశ్రీ ఉబీతిటవబ

అతను చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మరో ఇద్దరిలో అంజి(25) ప్రాథమిక చికిత్స పొంది హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ కాగా మరో వ్యక్తి అప్పలనాయడు(45) గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్నట్టు లేక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వీరు ముగ్గురు జలవిహార్‌లోని క్వార్టర్స్‌లో ఉంటూ అక్కడే కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారు. మృతి చెందిన లక్ష్మణ్ మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు పోలీసులు తెలిపారు.

# నమ్మిన సిద్ధాంతాలతో రాజీ పడని మొరార్జీ దేశాయ్

## ఏప్రిల్ 10... మొరార్జీ దేశాయ్ వర్ధంతి

తాను నమ్మిన సిద్ధాంతాలతో ఏనాడూ రాజీ పడని విలక్షణ వ్యక్తిత్వం దివంగత ప్రధాని మొరార్జీ దేశాయ్ కే సొంతం. మొరార్జీ దేశాయ్ దృష్టిలో నిజాయితీ అనేది ఒక విశ్వాసం తప్ప అవసరం కాదు. ఎట్టి పరిస్థితుల్లో అయినా ఆయన తాను నమ్మిన సిద్ధాంతాలకే కట్టుబడి ఉండేవారు. క్లిష్టమైన సందర్భాల్లో కూడా ఆయన రాజీపడిన దాఖలాలు లేవు. 'జీవితంలో ప్రతి ఒక్కరూ నిజాయితీకి కట్టుబడి నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలన్న ధర్మ సూత్రాన్ని' మొరార్జీ దేశాయ్ ఆచరించి చూపించారు.

ధృఢమైన గంధేయవాదిగా దేశాయ్, ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ సోషలిస్ట విధానాలకు వ్యతిరేకంగా సామాజిక సంప్రదాయ వాదిగా, అనుకూల - వ్యాపార, ఉచిత సంస్థ సంస్కరణలకు అనుకూలంగా ఉన్నారు. కాంగ్రెస్ నాయకత్వంలో ఎదిగిన దేశాయ్, అవినీతి వ్యతిరేక అంశాలతో తీవ్ర జాతీయ వాదిగా, ప్రధానమంత్రి నెహ్రూ, అయన మిత్రపక్షాలను విభేదించారు.

1927-28 గోద్రాలో జరిగిన అల్లర్ల సమయంలో హిందువులపై మెతక వైఖరి అవలంభించాననే అపరాధ భావంతో మే1930న అతను గోద్రా డిప్యూటీ కలెక్టరు ఉద్యోగానికి రాజీనామా చేసారు.

వివాదం లేకుండా ప్రజా జీవితంలో నాలుగు దశాబ్దాలు గడిపిన గొప్ప నాయకుడు. ప్రధాని పదవికి రాజీనామా చేసిన తరువాత, ఆయన ఎప్పుడూ క్రియాశీలక రాజకీయాల వైపు తిరిగి చూడలేదు.

మొరార్జీ దేశాయ్ బొంబాయి రాజ్యంలో (ప్రస్తుతం గుజరాత్) బ్లస్టర్ జిల్లాకు చెందిన భడేలీ గ్రామంలో 1896 ఫిబ్రవరి 29 న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ముంబైలోని విల్సన్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ చేసిన తరువాత ఆయన గుజరాత్ లో సివిల్ సర్వీసులో చేరారు.

మహాత్మాగాంధీ అధ్వర్యంలో జరిగిన భారత స్వాతంత్ర్యోద్యమంలో చేరారు. భారత దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో అనేక సంవత్సరాల పాటు జైలు శిక్ష అనుభవించారు. తన తెలివైన నాయకత్వ నైపుణ్యాల వల్ల స్వాతంత్ర్య సమర యోధులందరికీ అభిమాని అయ్యారు. గుజరాత్ ప్రాంతంలో భారత జాతీయ కాంగ్రెస్‌కు ముఖ్యమైన నాయకుడయ్యారు .1934, 1937 లలో ప్రాంతీయ ఎన్నికలు జరిగినప్పుడు, ఆయన బొంబాయి ప్రెసిడెన్సీలో వరుసగా రెవెన్యూమంత్రి, హోంమంత్రి బాధ్యతలను చేపట్టారు. 1952లో బొంబాయి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నుకో బడ్డారు. బొంబాయి రాష్ట్రం ద్వి భాషా రాష్ట్రంగా ఉండేది. బొంబాయి రాష్ట్రంలో గుజరాత్, మరాఠీ భాషలు మాట్లాడే ప్రజలు ఉండేవారు.

పార్లమెంటులో ఎనిమిది వార్షిక మరియు రెండు మధ్యంతర బడ్జెట్లను ప్రదర్శిస్తూ మొరార్జీ దేశాయ్ ఒక ప్రత్యేకమైన రికార్డును కలిగి ఉన్నారు. 1964 మరియు 1968 లో ఫిబ్రవరి 29 న రెండు కేంద్ర బడ్జెట్లను సమర్పించిన ఆర్థిక మంత్రిగా ఆయనకు ప్రత్యేకమైన ప్రత్యేకత ఉంది, ఇది అయన పుట్టినరోజు కావడం గమనార్హం.

దేశాయ్ ఇందిరా గాంధీ ప్రభుత్వంలో ఉప ప్రధాన మంత్రిగా సేవల నందించారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రభుత్వంలో అనేక కీలక పదవులను చేపట్టారు. బొంబాయి రాష్ట్ర ముఖ్యమంత్రి, భారత హోం మంత్రి, ఆర్థిక మంత్రి, ప్రతిపక్ష నేత పదవులతో పాటు భారతదేశ 2వ ఉపప్రధాని పదవిని కూడా చేపట్టారు.



1977 మార్చి 24వ తేది మొరార్జీ దేశాయి ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించారు. 1979 జూలై 26 వరకు భారత దేశానికి 4వ ప్రధానిగా తన సేవల నందించారు. భారత రాజకీయ చరిత్రలో 81 సంవత్సరాల వయసులో ప్రధాని పదవిలో ఉన్న నేత. అలాగే కాంగ్రెసేతర ప్రధానిగా పదవి చేపట్టి, 1979 లో ప్రధాని పదవి నుంచి తప్పుకున్నారు. రెండున్నర సంవత్సరాలు (మార్చి 1977 నుండి జూలై 1979 వరకు) మాత్రమే ప్రధానిగా ఉన్నారు.

దేశంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పరచిన నేతగా చరిత్రలో మిగిలి పోయారు.

అత్యధిక పౌర పురస్కారాలను అందుకున్న ఏకైక భారతీయుడిగా ఆయన గుర్తింపు పొందారు.

పాకిస్తాన్ సంబంధిత అత్యున్నత పౌర పురస్కారం... నిషానే - ఎ - పాకిస్తాన్ - 1986 లో

గెలుచుకున్న ఏకైక భారతీయుడు. 1991లో భారత రత్న పురస్కారం పొందారు. అలా భారత దేశం, పాకిస్తాన్ దేశాల అత్యున్నత పౌర పురస్కారాలైన భారత రత్న, నిషానే పాకిస్తాన్ లను పొందిన ఏకైక భారతీయుడు మొరార్జీ.

మొరార్జీ దేశాయ్ జనతాపార్టీకి 1980 సార్వత్రిక ఎన్నికలలో సీనియర్ రాజకీయ నాయకుడిగా ప్రచారం చేశారు, కాని ఎన్నికలో పోటీ చేయలేదు. అయన "యూరిన్ థెరపీ"ని అభ్యసించే వారు. 1978లో "మూత్ర చికిత్స" దీర్ఘకాలిక అభ్యాసకుడైన దేశాయ్ డేంరాథర్ తో "60 మినిట్స్" కార్యక్రమంలో మాట్లాడుతూ మూత్రం త్రాగడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. వైద్య చికిత్స పొందలేని లక్షల మంది భారతీయులకు మూత్ర చికిత్స అనేది పరిపూర్ణ వైద్య పరిష్కారం అని దేశాయ్ వివరించారు. స్వ మూత్రం తాగడం ద్వారా తన దీర్ఘాయువుని కాగలిగానని చెప్పారు. దీనిని "జీవజలము" అని పిలిచారు.

దేశాయ్ 1896 లో జన్మించారు. పదవీ విరమణ తరువాత అయన ముంబైలో నివసించి సంతోషంగా గడిపి, 1995 లో 99 సంవత్సరాల వయసులో మరణించారు. దేశాయ్ తన 100 వ పుట్టిన రోజుకు కొద్ది నెలల వ్యవధిలో 1995 ఏప్రిల్ 10 న కన్ను మూశారు. అత్యధిక కాలం జీవించిన దివంగత భారత ప్రధానిగా పేరు గడించారు.

పాశ్చాత్య సాంప్రదాయం ప్రకారం పుట్టిన తేదీన జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం. ప్రతి ఏడూ అలా పాశ్చాత్య సంస్కృతి ప్రభావాన పుట్టిన తేదీన భారత దేశంలోనూ జన్మదినం సందర్భంగా వేడుకలు జరుపుకోవడం సర్వసాధారణం. అయితే భారత దేశ చరిత్రలో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి, వివిధ పదవులను అలంకరించి, దాదాపు శత సంవత్సరాలు జీవించిన ఒక గొప్ప నాయకునికి అలాంటి అవకాశం లేకుండా పోయింది. అందుకే ఆ దివంగత గొప్ప నాయకుని జన్మదినం చాలా మందికి గుర్తుండదు. ఆయనే దివంగత భారత ప్రధాని మొరార్జీ దేశాయ్. కారణం ఆయన ఫిబ్రవరి 29వ తేదీన జన్మించడమే. లీపు సంవత్సరము అయితే తప్ప ఆయనది ప్రాతి సంవత్సర జన్మదినం కాకపోవడమే. నాలుగు ఏళ్లకు ఒకసారి మాత్రమే ఫిబ్రవరి 29 రావడం కావడమే. జన్మదిన ప్రత్యేకత లాగే పలు విధ ప్రత్యేకతల సమాహారం మొరార్జీ జీవితం.

మొరార్జీ దేశాయ్ పండిన 99 ఏళ్ళ వయసు వరకు జీవించినా, ఫిబ్రవరి 29 న జన్మించి నందున అయన తన జీవిత కాలంలో కేవలం 24 పుట్టిన రోజులను మాత్రమే చూసి, 25వది రావడానికి కొద్ది రోజుల ముందు కన్ను మూశారు.



-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

# ప్రభుత్వ విప్ చొరవతో విద్యుత్ వైర్ల తొలగింపు

## - ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఊపిరి

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 9:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని కోరుట్ల రోడ్ భీమేశ్వర ఫంక్షన్ హాల్ సమీపంలో ప్రమాదకరంగా వెళ్లిన విద్యుత్ వైర్ల కారణంగా నిలిచిపోయిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఊరట లభించింది. లబ్ధిదారురాలు బింగి రేణుకకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి పైనుండి విద్యుత్ లైన్ వెళ్లడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. సమస్య పరిష్కారం కోసం ఆమె ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, టీఎస్ ఎన్‌పీడీసీఎల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గురువారం టీఎస్ ఎన్‌పీడీసీఎల్ అధికారులు ప్రమాదకర విద్యుత్ లైన్‌ను తొలగించడంతో ఇంటి నిర్మాణానికి ఉన్న అడ్డంకి తొలగిపోయింది. దీంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో లబ్ధిదారురాలు రేణుక ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా సమస్యను పరిష్కరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, వార్డు కౌన్సిలర్ సంగీత-శ్రీకాంత్లకు బింగి రేణుక కృతజ్ఞతలు తెలిపారు.



# సామాజిక రుగ్మతల నిర్మూలనలో జర్నలిస్టులది కీలక పాత్ర

## - ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుభాకాంక్షలు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 9:(నేటినిజం ప్రతినిధి): . గురువారం వేములవాడ ప్రెస్ క్లబ్ (ఐజేయూ) నూతన కార్యవర్గ సభ్యులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజ సేవలో పాత్రికేయులు ముందుండాలని, సామాజిక దురాచారాలను రూపుమాపడంలో మీడియాది ప్రధాన పాత్ర అని పేర్కొన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా జర్నలిస్టులు ముందుకు సాగడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి తాము కట్టు బడి ఉన్నామని, పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన రాపెల్లి శ్రీనివాస్, ఇతర కార్యవర్గ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు రేగుల దేవేందర్, గోగికారి శ్రీనివాస్, ఐజేయు జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్, ఉపాధ్యక్షుడు కంకణాల సాయి శరత్ బాబు, ప్రధాన కార్యదర్శి ఉల్లెందుల మల్లేశం, కోశాధికారి గడీల ప్రవీణ్, సహాయ కార్యదర్శి మదాం బాబు పాల్గొన్నారు. అలాగే కార్యవర్గ సభ్యులు తుపుకారి శ్రీనివాస్, కొక్కుల శ్రీనివాస్, సయ్యద్ హబీబ్ పాషా, గొంగల్ల రవికుమార్, పోకల ఆంజనేయులు, ఎనుగందుల నగేష్, కాజా నయిమోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# కాసర్ల నాగేందర్ రెడ్డి ఆస్ట్రేలియాలో పార్టీ కోసం ఎంతో కృషి చేస్తున్నారు. : కేటీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 9:మాజీ మంత్రి జీవన్ రెడ్డితో చర్చలకై జగిత్యాల పర్యటనకు వెళ్తున్న కేటీఆర్ మార్గ మధ్యంలో కరీంనగర్‌లో ఉన్న కాసర్ల నాగేందర్ రెడ్డి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను కలిసి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాగేందర్ రెడ్డి ఆస్ట్రేలియాలో పార్టీ బలోపేతం కోసం చేస్తున్న కృషిని కొనియాడారు. పార్టీ కోసం కష్టపడేవారిని ఎల్లవేళల ప్రోత్సహిస్తామని, యువతకు ఇక పై అగ్ర పీఠం వేస్తామని కేటీఆర్ తెలిపారు. కేటీఆర్ తో పాటు ఎంపీ దామోదర్ రావు, వినోద్ కుమార్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, కౌశిక్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు, మాజీ చైర్మన్లు నాగేందర్ రెడ్డి ఇంటికి వెళ్లినవారిలో ఉన్నారు.

# అమరావతిని వ్యతిరేకించిన పార్టీ వైసీపీ

అమరావతి, ఏప్రిల్ 9:దేశంలో అమరావతిని వ్యతిరేకించిన ఏకైక పార్టీ వైసీపీ అని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రాంతాలు, కులాలతో రాజకీయం చేస్తే గెలవలేమన్నారు. బాపట్ల జిల్లా సూరేపల్లిలో నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ వెయ్యి మంది సైకోలు వచ్చిన అమరావతి ఆగదన్నారు. అమరావతి విషయంలో న్యాయం.. ధర్మం.. చట్టం గెలిచిందన్నారు.

ఆనాడు హైదరాబాద్ ను డెవలప్ చేశా ఇప్పుడు అమరావతిని నిర్మిస్తున్నానన్నారు. అన్నీ ఆలోచించే రాజధానికి అమరావతి పేరు పెట్టానన్నారు. ప్రజా రాజధాని, దేవతల రాజధాని అమరావతి అన్నారు. ఆనాడు బాబాయ్ ను చంపేసి ఆ నేరం తనపై వేశాడన్నారు. అమరావతిపై జగన్ కక్ష్యగట్టారన్నారు. అమరావతి అజేయంగా ముందుకు వెళ్తుందన్నారు. ఆనాడు ఆడబిడ్డలను వేధించారన్నారు. డ్రోన్లతో ఆడబిడ్డలను వీడియో తీశారన్నారు.. లాఠీలతో కొట్టించారన్నారు. అమరావతే రాష్ట్ర రాజధాని అని కేంద్రం చట్టం చేసిందన్నారు. రాజధాని అమరావతి ఓకి కేంద్రం రాజముద్ర వేసిందన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. 'మీ భూమి మీ హక్కు' కార్యక్రమం కోసం సూరేపల్లి రావడం ఆనందంగా ఉందని చెప్పారు. 2027 మార్చి నాటికి 1.12 కోట్ల పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తామన్నారు. 16 వేలకుపైగా గ్రామాల్లో ఇంకా రీసర్వే చేయాల్సి ఉందని పేర్కొన్నారు. భూ రికార్డులు ట్యాంపర్ కాకుండా బ్లాక్ చైన్ టెక్నాలజీ తెచ్చామని, పుస్తకాలపై క్యూఆర్ కోడ్ ఇచ్చామని, రికార్డులు డిజిటల్ లాక్ చేసుకునే అవకాశం కల్పించామన్నారు.

# 'నాణ్యమైన విద్యతోనే బడుల్లో నమోదు పెరుగుదల'

ఖమ్మం, ఏప్రిల్ 9: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడం ద్వారానే విద్యార్థుల ప్రవేశాల నమోదు పెరుగుతుందని ఖమ్మం జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి(ఏఎంఓ) పెసర ప్రభాకర్ రెడ్డి అన్నారు. కారేపల్లి మండలం ప్రాథమికోన్నత పాఠశాల తొడితలగూడెం, ప్రాథమిక పాఠశాల పంతులు నాయక్‌తండాను ఆయన సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసి బోధన అభ్యసన ప్రక్రియలను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఇంటరాక్ట్ అయ్యారు. ప్రాథమిక పాఠశాలలో ప్రతిష్టాత్మకంగా అమలు పరచబడుతున్న ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ అనే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా మానిటరింగ్ అధికారి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో ఫైవ్ ప్లస్ వన్ సిస్టం అమలులో ఉందన్నారు. పిల్లలలో అభ్యాసం పెరగటానికి పాఠ్య పుస్తకాలు, వర్కు బుక్కులను సమన్వయం చేస్తూ బోధనాభ్యసన ప్రక్రియలను నిర్వహించాలన్నారు. తరగతి గదులలో జరిగే నాణ్యమైన బోధన ద్వారా మాత్రమే విద్యార్థులు వారి తల్లిదండ్రులు బడుల వైపు ఆకర్షితమవుతారన్నారు. మానిటరింగ్ అధికారి వెంట సీఆర్పీ కిశోర్ బాబు ఉన్నారు.

# ఒలింపియాడ్‌లో 'అల్ఫోర్స్' విద్యార్థుల సత్తా

## -అంతర్జాతీయ సోషల్ స్టడీస్ పోటీల్లో పతకాల పంట

## -విజేతలకు చైర్మన్ వి నరేందర్ రెడ్డి అభినందన



కరీంనగర్, ఏప్రిల్ 9:(నేటినిజం ప్రతినిధి) అంతర్జాతీయ స్థాయి సాంఘిక శాస్త్ర ఒలింపియాడ్ పోటీల్లో అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. సిల్వర్ జోన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సోషల్ స్టడీస్ ఒలింపియాడ్‌లో కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు స్వర్ణ, రజత పతకాలను కైవసం చేసుకున్నారు. విద్యార్థుల ఈ ఘన విజయాన్ని పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన సభకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పుస్తక పఠనానికే పరిమితం కాకుండా, సామాజిక అంశాలపై లోతైన అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. సాంఘిక శాస్త్రంలోని అంశాలను విశ్లేషణాత్మకంగా అర్థం చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో సులభంగా విజయం సాధించవచ్చని ఆకాంక్షించారు. సామాజిక అవగాహన కలిగిన విద్యార్థులే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని ఆయన అభిప్రాయపడ్డారు. స్వర్ణ పతకాలు సాధించిన విద్యార్థులుకోలా అతిథి కిషన్, వి.వేద విహార్, బి.కార్తికేయ గౌడ్, విఘ్నేష్, హెచ్.శ్రీహాన్, చైతన్యలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేసి పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేములవాడ యువకుడి ప్రతిభ.. రాష్ట్రస్థాయికి రొండి నిశాంత్ ఎంపిక

## -అథ్లెటిక్స్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన నాగాయ పల్లె యువకుడు



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 9:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం నాగయ్యపల్లెకు చెందిన యువ అథ్లెట్ రొండి నిశాంత్ రాష్ట్రస్థాయికి ఎంపికై ప్రాంతానికి గర్వకారణంగా నిలిచాడు. బోయిన్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న నిశాంత్, ఈ నెల 11న హనుమకొండలో నిర్వహించనున్న అథ్లెటిక్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గంజి విశ్వనాథం తెలిపారు. ఇటీవల ఈ నెల 6న నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలలో నిశాంత్ అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. అతని క్రీడా నైపుణ్యం, పట్టుదల ప్రశంసనీయం అని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గంజి విశ్వనాథం మాట్లాడుతూ? రాష్ట్రస్థాయి పోటీలలో కూడా నిశాంత్ మెరుగైన ప్రతిభ కనబరిచి అథ్లెటిక్స్ ఫెడరేషన్ కప్ సాధించాలని ఆకాంక్షించారు. గంగాధర మండలం మధురానగర్ గ్రామంలోని పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు జి. నరేష్, ఉపాధ్యాయులు బి. రాజు తదితరులు నిశాంత్‌ను అభినందించారు. వేములవాడ రూరల్ మండలం నాగయ్యపల్లెకు చెందిన ఈ యువకుడు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల గ్రామంలో ఆనందం వ్యక్తమవుతోంది. స్థానికులు, స్నేహితులు నిశాంత్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ, మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని కోరుకుంటున్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com